PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 295 | విజయవాడ, ఆదివారం 28 మే 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 28 May 2023 | Rs

మోడీ పాలనలో నిరుద్యోగం రెట్టింపు

- డివైఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎఎ రహీం, హిమాగ్నరాజ్ భట్టాచార్య
- హైదరాబాద్‌లో కేంద్ర కమిటీ సమావేశాలు ప్రారంభం

లోపలి పేజీలో..

నేడు 73 మండలాల్లో వడగాడ్పులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 73 మండలాల్లో ఆదివారం వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అల్లూరిలో 3, బాపట్ల 1, తూర్పుగోదావరి 11, ఏలూరు 5, గుంటూరు 15, కాకినాడ 8, కృష్ణా 9, ఎన్‌టిఆర్ 10, పల్నాడు 5, మన్యం 4, వైఎస్‌ఆర్ కడప జిల్లాలో 2 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు ద్రోణి ప్రభావంతో అల్లూరి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్‌ఆర్, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లెలో 44.9 డిగ్రీలు, తిరుపతి జిల్లా గూడూరులో 44.6 డిగ్రీలు, బాపట్ల జిల్లా చెరుకుపల్లి, ఏలూరు జిల్లా పెదవేగి మండలాల్లో 44.5 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నీతి ఆయోగ్ సమావేశంలో ప్రసంగిస్తున్న మోడీ.. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్, ఇతర రాష్ట్రాల సిఎంలు

రానున్నది క్యాష్ వార్

ధన ప్రభావంతో గెలిచేందుకు జగన్ ప్రయత్నం • ఎన్నికలకు సిద్ధం కండి • మహానాడులో చంద్రబాబు

మహానాడు ప్రాంగణం నుండి ఎం శివాజీ

రానున్నది క్యాష్ వార్ అని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. ధన ప్రవాహంతో ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దీనివల్ల పేదలు పేదలుగా మిగులుతున్నారని, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారని అన్నారు. రూ.2 వేల నోట్లను రద్దు చేయాలని తానే డిమాండ్ చేశానని, రూ.500 నోట్లను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నానని తెలిపారు. పేదలను ధనికులను చేసేందుకు యుద్ధం చేస్తున్నామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. పి 4 అనే విధానంతో పేదలను సంపన్నులను చేద్దామని పిలుపునిచ్చారు. టిడిపి మహానాడు, ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు రాజమహేంద్రవరంలో శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమంలో చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేశారు. అలాగే అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ప్రసంగించారు. ఇది చారిత్రక మహానాడు అని, ఒకవైపు ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు, మరోవైపు పార్టీ 42 ఏళ్ల ప్రయాణం సందర్భంగా జరుగుతోందని అన్నారు. నోట్ల రద్దుపై వైసిపి, ఇతర రాజకీయ పార్టీలు తమ విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. జగన్ ఇప్పటికే రూ.2 వేల నోట్లను వేల కోట్లను పెద్ద ఎత్తున నియోజక వర్గాలకు పంపారని, ఈ డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు రూ.2 వేల నోట్ల రద్దుతో వీటిని రూ.500 నోట్లగా మార్చుకుంటున్నారని తెలిపారు. ఈ దృష్ట్యా రూ.500 నోట్లను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రధానిగా తనకు అవకాశం వచ్చినా రాష్ట్రాభివృద్ధి కోసం వదులుకున్నానన్నారు. రానున్న ఎన్నికలకు సంబంధించిన మొదటి దశ మ్యానిఫెస్టోను మహానాడు వేదికగా ఆదివారం



మహానాడు వేదికపై తెలుగుదేశం పతాకాన్ని రెపరెపలాడిస్తున్న చంద్రబాబు, అచ్చెన్నాయుడు తదితరులు

ప్రకటిస్తామని వెల్లడించారు. ప్రజలు మెచ్చేలా అదిరిపోయే సంక్షేమం చేద్దామని, అందరితో చర్చించి ప్రకటిస్తామని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమేనని స్పష్టం చేశారు. వచ్చేది కురుక్షేత్రమని, ఈ యుద్ధంలో వైసిపి కౌరవ సేనను ఓడిద్దామని పిలుపునిచ్చారు. శాసన సభను గౌరవ సభగా చేసి అసెంబ్లీకి వెళ్దామన్నారు. క్యాడర్‌లో ఉత్సాహం పెరిగి శక్తి వచ్చిందన్నారు. ఎవరైనా అడ్డం వస్తే తొక్కుకుంటూ ముందుకు పోదామని పేర్కొన్నారు. ఒక్క అవకాశం అని దొంగ మాటలు చెప్పి వచ్చిన జగన్‌ను ఇంటికి పంపాలని కోరారు. రాష్ట్రాన్ని దేశంలో నెంబర్-1గా మార్చే సత్తా మనకే ఉందని అన్నారు. క్యాడర్‌కు, అధిష్టానానికి పెరిగిన గ్యాప్ టెక్నాలజీ ద్వారా పోయిందన్నారు. నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర అద్భుతంగా జరుగుతోందని పేర్కొన్నారు. నాలుగేళ్లలో కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేశారని, అరెస్టులు, కేసులు, దాడులకు ఒక్కరూ భయపడలేదని అన్నారు. భవిష్యత్తులో కార్యకర్తలను ఆదుకునే బాధ్యత తనదేనని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత వందల సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. 2019లో ఎన్నో మాటలు చెప్పి జగన్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో సిఐడి అంటే కరప్షన్ ఇన్ ఎఫిషియంట్ డిస్ట్రక్షన్‌గా ప్రభుత్వం మార్చేందని ఆరోపించారు. రివర్స్ టెండర్లు అని పరిపాలనను రివర్స్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలో రాజధానిలేని రాష్ట్రంగా మన రాష్ట్రమే నిలిచిందన్నారు. అమరావతిని సర్వనాశనం చేశారని విమర్శించారు. ఒక్క రోడ్డు మిగతా 5లో

టిడిపి అధ్యక్షునిగా చంద్రబాబు

ప్రజాశక్తి- ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం రాజమహేంద్రవరం)

టిడిపి జాతీయ అధ్యక్షునిగా నారా చంద్రబాబునాయుడు 14వసారి ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరంలో జరిగిన టిడిపి మహానాడులో ఏకగ్రీవంగా ఆయన ఎన్నికయ్యారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు ఆధ్వర్యంలో ఎన్నికల కమిటీ ఈ ప్రక్రియను పూర్తి చేసింది. చంద్రబాబును అధ్యక్షునిగా బలపరుస్తూ 11 నామినేషన్లు దాఖలయ్యాయి. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు చంద్రబాబును అధ్యక్షునిగా ప్రకటించారు. అనంతరం చంద్రబాబుతో ఆయన ప్రమాణం చేయించారు. పార్టీలో మిగిలిన కమిటీల ఏర్పాటు, మార్పులు, చేర్పులు చేసే అధికారం అధ్యక్షుడికి ఉంది.

నీతి ఆయోగ్‌లో నీతులు

- రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి
- పాలకమండలి సమావేశంలో ప్రధాని మోడీ
- 11 మంది ముఖ్యమంత్రుల గైర్హాజరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హితోక్తులు పలికారు. ఫెడరలిజం గురించి గొప్పలు చెప్పారు. నిత్యం రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తూ పెత్తందారి పోకడలు అలంబిస్తున్న మోడీ..నీతి అయోగ్ పాలక మండలి సమావేశంలో సమాఖ్య రాగాలాపన చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వానిదే తుది నిర్ణయమని ఢిల్లీ పాలనవ్యవహారాలపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చినా.. ఆ తీర్పును కాలరాసి ఆర్డినెన్స్ తీసుకొచ్చి లెఫ్టినెంట్ గవర్నరుకు అధికారాలు కట్టబెట్టిన కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇలా సమాఖ్య రాగాలాపన చేయడం విడ్డూరం. మాటలకు చేతలకు పొంతన లేని ఈ తీరును నిరసిస్తూ ప్రతిపక్షాల పాలనలోని 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ కారణాలతో సమావేశానికి గైర్హాజరయ్యారు.

రాష్ట్రాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శనివారం నాడిక్కడ ప్రగతి మైదానంలోని కన్వెన్షన్ సెంటర్‌లో నరేంద్ర మోడీ అధ్యక్షతన నీతి ఆయోగ్ పాలక మండలి ఎనిమిదో సమావేశం జరిగింది. 'వికసిత్ భారత్ @ 2047' అనే థీమ్ తో నిర్వహించిన ఈ సమావేశంలో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా.. ఆరోగ్యం, నైపుణ్యాల అభివృద్ధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల వృద్ధి వంటి ఎనిమిది అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్, కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల సిఎంలు భూపేష్ భఘేల్, సుఖ్వేంధర్ సుక్, బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, పియూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, నారాయణ్ రాణె, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ 2047లో వికసిత్ భారత్‌ను సాధించేందుకు కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు టీమ్ ఇండియాగా కలిసి పనిచేయాలని అన్నారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య సమాన భాగస్వామ్యానికి నీతి ఆయోగ్ ఒక వేదికను అందిస్తుందని, తద్వారా దేశంలో సహకార, పోటీ సమాఖ్యవాదాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. కోఆపరేటివ్ ఫెడరలిజాన్ని బలోపేతం చేసేందుకు నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమం (ఎడిపి) వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎడిపిలో చురుగ్గా పాల్గొన్నందుకు రాష్ట్రాలను అభినందించారు. ఎడిపి విజయవంతం కావడంతో నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక బ్లాక్ (ఎబిపి)ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందన్నారు. రాష్ట్రాల్లో 500 వెనుకబడిన బ్లాకుల్లో ప్రజల మిగతా 5లో

రాష్ట్రాలన్నీ ఒక జట్టుగా పనిచేయాలి : జగన్ 2

పోలవరం నిర్వాసితులకు పునరావాస చర్యలు కోరుతూ

20 నుండి మహాపాదయాత్ర

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గోదావరి నదికి వరదలు రాకముందే పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తక్షణమే నిర్వాసితుల ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రజలకు వరదలతో అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం సమాయత్తం చేయాలని కోరింది. విజయవాడలోని ఎంబివికెలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, ఎంఎ బేబి, బివి రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ తీర్మానాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మీడియాకు విడుదల చేశారు.

గతేడాది జులైలో గోదావరికి వచ్చిన వరదలతో ప్రజలు ఇప్పటికీ కోలుకోలేని పరిస్థితులు వున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంపు ప్రాంతాల్లోని గిరిజన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని పేర్కొన్నారు. పోలవరం ముంపు ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలు ఎలాంటి అభివృద్ధికి, సంక్షేమానికి నోచుకోక దుర్భరంగా జీవనం సాగిస్తున్నారని వివరించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికాకముందే వందలాది గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ఆ వరదల ముంపు ఆధారంగా నిర్వాసితుల పునరావాసానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పేరుతో మరో 32 గ్రామాలను కొత్తగా చేర్చిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్ల ఎత్తు వద్ద వున్న మిగతా 2లో

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వి రాంభూపాల్, వి ఉమామహేశ్వరరావు





పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గంలోకి అనంతపురం జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావును కొత్తగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గంలో ఇప్పటి వరకూ ఆహ్వానితులుగా వున్న కిల్లో సురేంద్ర, కె సుబ్బరావమ్మ పూర్తిస్థాయి సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కమిటీ ఆహ్వానితులుగా వున్న కె ఉమామహేశ్వరరావు మరియు అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ రవి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

కేంద్రానికి రూ.13,800 కోట్లు డివిడెండ్

- ప్రభుత్వ రంగ బ్యాంకుల ఘనత

న్యూఢిల్లీ : కేంద్రానికి ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)లు భారీ డివిడెండ్‌ను అందించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను రికార్డుస్థాయిలో గతంలో ఎన్నడూ లేనంతగా రూ.13,800 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించాయి. 12 ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు 2021-22లో రూ.9,210 కోట్ల డివిడెండ్‌ను అందించగా ఈ ఏడాది మార్చితో ముగిసిన కాలానికి 50 శాతం పెంచి ఇచ్చాయి.

ఈక్విటీ డివిడెండ్ కూడా 53 శాతం పెంచి రూ.21,000 కోట్లు కేటాయించాయి. ఇది 2021-22లో రూ.13,710 కోట్లుగా ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కేంద్రానికి అత్యధికంగా ఎస్‌బిఐ రూ.5,740 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. కేంద్రానికి అందిన మొత్తం డివిడెండ్‌లో ఎస్‌బిఐ వాటానే 42 శాతంగా ఉంది. 2022-23కు గాను ఆర్‌బిఐ కూడా కేంద్రానికి రూ.87,416 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 2021-22లో రూ.30,307 కోట్లతో పోల్చితే ఇది దాదాపు మూడు రెట్లు ఎక్కువ.

నేడు కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం ఆదివారం జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించనున్నారు. పార్లమెంట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసే పందిరిలో సంప్రదాయ పూజలు, హోమంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందులో ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్, మాజీ ప్రధాని హెచ్‌డి దేవగౌడ, సీనియర్ మంత్రులు పాల్గొంటారు. పూజా కార్యక్రమాలు పూర్తికాగానే ఇందులో పాల్గొనే ప్రముఖులంతా కలిసి లోక్‌సభ, రాజ్యసభ ప్రాంగణాలను వీక్షిస్తారు.

ఉదయం ఏడింటికి హోమం జరుగుతుంది. ఆ తరువాత సర్వ మత ప్రార్థనలు జరుగుతాయి. ఉదయం 9:30 గంటల కల్లా తొలి విడత ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తవుతుంది. అనంతరం హోమం వేదిక వద్దే తమిళనాడు తంజావూరు శైవ మత పెద్దలు చోళుల రాజదండమైన సెంగాల్ ప్రధాని నరేంద్ర మోడీకి అందజేస్తారు. లోక్‌సభ ఛాంబర్‌లో స్పీకర్ కుర్చీ వద్ద రాజదండాన్ని (సెంగాల్) ప్రతిష్ఠిస్తారు. మధ్యాహ్నం రెండో విడత కార్యక్రమం మొదలవుతుంది. మధ్యాహ్న కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రసంగం ఉంటుంది. రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ తరపున అభినందన సందేశాన్ని ఆయన చదివి వినిపిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లిఖితపూర్వక సందేశాన్ని కూడా ఇదే సందర్భంగా సభలో చదివి వినిపిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రూ.75 నాణేన్ని, ఒక స్మారక తపాలా బిళ్లను ప్రధానమంత్రి విడుదల చేస్తారు. కార్యక్రమాన్ని ముగిస్తూ లోక్‌సభ సెక్రటరీ జనరల్ 'ఓట్ ఆఫ్ థాంక్స్' చెబుతారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలతో పాటు వైసిపి, టిడిపి, ఎస్‌ఎడి, జెడిఎస్, బిఎస్‌పి తదితర పార్టీలు పాల్గొంటాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖర్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లకు ఆహ్వానం అందలేదు. ద్రౌపది ముర్ము, రామ్‌నాథ్ కోవింద్ గిరిజన, దళిత నేతలు అయినప్పటికీ ప్రభుత్వం చెబుతున్న ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ఆహ్వానించ లేదు. ద్రౌపది ముర్మును పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడాన్ని నిరసిస్తూ 20 ప్రతిపక్ష పార్టీలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాయి.

నెలాఖరు వరకు అవినాష్‌రెడ్డిపై చర్యలొద్దు

- సిబిఐకి హైకోర్టు ఆదేశాలు
- ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



ఈ నెల 31 వరకు ఎపి వైఎస్ అవినాష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవద్దని సిబిఐని తెలంగాణ హైకోర్టు శనివారం ఆదేశించింది. అవినాష్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వేసవి సెలవుల ప్రత్యేక బెంచ్ ముందు సిబిఐ వాదనలు వినిపించింది. సిబిఐ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనిల్ వాదించారు. అవినాష్‌రెడ్డికి బెయిల్ ఇవ్వవద్దని కోర్టును కోరారు. వివేకా హత్యకు నెల ముందే కుట్ర జరిగిందని, అవినాష్ నోరు విప్పితేనే దర్యాప్తు కొలిక్కి వస్తుందని పేర్కొన్నారు. అవినాష్ విచారణకు సహకరించడం లేదని, కేసు దర్యాప్తులో మొదటి నుంచి ఆటంకాలు సృష్టిస్తున్నారని అన్నారు. 'అవినాష్ కోరినట్టు విచారణ జరగదు. సిబిఐకి ప్రత్యేక విధానం ఉంటుంది. నోటీసు ఇచ్చిన ప్రతిసారీ ఏదో ఒక కారణం చెపుతున్నారు. ఈ కేసు విచారణలో ఎంతోమందిని విచారించాం. కొంతమందిని అరెస్ట్ చేశాం. అవినాష్‌రెడ్డికి ప్రత్యేక పరిస్థితి ఎందుకు? కోర్టుల్లో రకరకాల పిటిషన్లు వేస్తూ విచారణ జాప్యం చేస్తున్నారు' అని హైకోర్టు దృష్టికి సిబిఐ తీసుకెళ్లింది. బుధవారం అవినాష్‌ను విచారణకు పిలుస్తామని తెలిపింది. ఈ సమయంలో కల్పించుకున్న జడ్జి సిబిఐపై ప్రశ్నలు గుప్పించారు. మిగతా నిందితులతో పోలిస్తే అవినాష్‌రెడ్డికి ఉన్న ప్రత్యేకత ఏమిటని, మిగతా నిందితులు విచారణకు సహకరిస్తున్నప్పుడు ఆయన ఎందుకు సహకరించడం లేదని న్యాయస్థానం ప్రశ్నించింది. ఒక సామాన్యుడు నిందితుడు అయి ఉంటే ఇంత ఆలస్యంగా దర్యాప్తు ఉండేదా? అని న్యాయస్థానం సిబిఐని సూటిగా నిలదీసింది. రెండు రకాల నేరాలకు నిందితులు పాల్పడ్డారని, ఒకటి వివేక హత్య, రెండోది క్రైమ్ సీన్ డిస్ట్రక్షన్ అని సిబిఐ న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఎన్నికల్లో వివేకా ఓడిపోవడం అంటే ఇది మిగతా 5లో

నాటో కూటమిలోకి భారత్!

- చైనాపై ఏర్పాటైన అమెరికన్ హౌస్ కమిటీ సిఫారసు
- త్వరలో మోడీ అమెరికా పర్యటన

లోపలి పేజీలో..

ఎస్‌ఎల్ ఫ్యాక్టరీలో విషవాయువులు లీక్

- ముగ్గురికి అస్వస్థత
- విజయవాడ జిజిహెచ్‌కు తరలింపు

లోపలి పేజీలో..

వేతనాలు పెంచండి.. ఉక్రెయిన్‌కు ఆయుధాలివ్వొద్దు

- ఇటలీ, స్పెయిన్‌లో కార్మికుల సమ్మె సక్సెస్



ఆడుదాం ఆంధ్రా

గ్రామ నుంచి రాష్ట్ర స్థాయి వరకు

ఐదు విడతల్లో భారీగా క్రీడలు

49 రోజులపాటు నిర్వహణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా భారీ క్రీడా సంగ్రామానికి తెర తీయనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ క్రీడా రంగాల్లో పోటీలు నిర్వహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నిర్ణయించింది. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట ఈ క్రీడలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ సందర్భంగా వివిధ స్థాయిల్లో 2.99 లక్షల పోటీలను నిర్వహించేందుకు అధికారులు ప్రతిపాదించారు. రూ.45 కోట్లతో 49 రోజుల పాటు ఈ క్రీడలు నిర్వహించనున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ క్రీడల నిర్వహణపై ఆసక్తి కనపరిచారని, అందుకే భారీ ఎత్తున కసరత్తు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. గ్రామ-వార్డు స్థాయి నుంచి మండల, నియోగజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ ఆటలు జరగనున్నారు. ఇవన్నీ నాకవుట్ స్థాయిలోనే ఉంటాయి. ఈ క్రీడా సంబరాలను విజయవంతం చేయడంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, గ్రామ-వార్డు సచివాలయాల శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, సాంఘిక, గిరిజన, బిసి సంక్షేమశాఖలు, మున్సిపల్, సమాచారశాఖ, క్రీడాశాఖలు కీలకంగా వ్యవహరించనున్నాయి.

కలెక్టర్లకూ బాధ్యతలు

ఈ క్రీడా సంబరాలను విజయవంతం చేసేందుకు కలెక్టర్లు, జిల్లా క్రీడా అథారిటీలకు కూడా కీలక బాధ్యతలు అప్పగించనున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడా మైదానాలను గుర్తించడం, నిర్వహణకు పిఇటిలు, పిడిలను సిద్ధం చేయడం, దిగువ స్థాయి అధికారులు ఈ క్రీడల నిర్వహణకు వినియోగించడం, క్రీడాకారులకు అవసరమైన రవాణా, ఆహారం, వసతి ఏర్పాటుచేయడం వంటి బాధ్యతలు కలెక్టర్లు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు చూడాల్సి ఉంటుంది.

ప్రధానంగా ఐదు క్రీడలు

ఈ క్రీడా సంబరాల్లో ప్రధానంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి పోటీలు నిర్వహించనున్నారు. వీటికి అదనంగా 3కె మారథాన్, యోగా, టెన్నికాయిట్‌తోపాటు మరుగున పడుతున్న సంప్రదాయ గ్రామీణ క్రీడల్లోనూ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రీడల్లో గ్రామ స్థాయి వాటికి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల్లో కూడా నిర్వహించాలని యోచిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలను విశాఖలోని వైఎస్‌ఆర్ స్టేడియం, జివిఎంసి స్పోర్ట్స్ ఎరీనా, ఆంధ్రా విశ్వవిద్యాలయం మైదానాల్లో నిర్వహించనున్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేయనున్నారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి వద్ద కూడా సమీక్ష ఉంటుందని, ఆ తరువాత సంబరాలను ఖరారు చేస్తారని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రాలన్నీ ఒక జట్టుగా పనిచేయాలి

- నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని అన్ని రాష్ట్రాలు ఒక జట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి రాష్ట్రం శ్రేయస్సు మొత్తం దేశంతో ముడిపడి ఉంటుందని చెప్పారు. దేశంలో వ్యవసాయం, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై అత్యంత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం నాడిక్కడ జరిగిన నీతి ఆయోగ్ ఎనిమిదో పాలకమండలి సమావేశంలో పాల్గొన్న సిఎం జగన్ నీతి ఆయోగ్ చర్చలో వివిధ అంశాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరించేలా నోట్‌ను సమర్పించారు. దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు 14 శాతంగా ఉందని, దేశ ఉత్పత్తులు ప్రపంచ స్థాయిలో పోటీపడేందుకు ఇది ప్రతిబంధకంగా మారుతుందని చెప్పారు. అమెరికాలో లాజిస్టిక్స్ ఖర్చు కేవలం 7.5 శాతమేనని, ఆశించిన ఫలితాలను సాధించడానికి సరకు రవాణా కారిడార్లు దేశవ్యాప్తంగా ఒకే ధరపై ప్రభుత్వం ఖర్చు చేయడం చాలా అవసరమని అన్నారు.

ఏపీ ప్రభుత్వం పోర్టు ఆధారిత అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో కొత్తగా నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. కర్నూలులో ఓర్వకల్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశామని, విశాఖపట్నంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పిపిపి పద్ధతిలో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. దేశ జిడిపిలో తయారీ, రంగాల వాటా 85 శాతం దాటినప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. రెండు వేల ప్రపంచ సగటు వాటా 91.5 శాతమని, ఈ లక్ష్యాన్ని సాధించడానికి వ్యవసాయం, పెట్టుబడులకు సంబంధించిన రంగానికి సంబంధించి అత్యంత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార రంగంలో స్వయం సమృద్ధిని సాధించడంతోపాటు, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం చాలా అవసరమని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గత మూడేళ్లుగా వరుసగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, వ్యాపారులకు అత్యంత అనుకూలమైన అనుమతులు సహా ఇతర విధానాలను సరళీకృతం చేశామని తెలిపారు. ప్రజారోగ్యం, పౌష్టికాహారం చాలా ముఖ్యమని అన్నారు. పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, దీర్ఘకాలిక వ్యాధుల భారం గురించి తెలుసుకోవాలని అన్నారు. అందువల్ల హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, పౌష్టికాహారంపై అత్యంత శ్రద్ధపెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10,592 గ్రామ, వార్డు క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని, ఇందులో ఒక మిడ్-లెవల్ హెల్త్ ప్రొవైడర్, ఒక ఎన్‌ఎంను, ఆశావర్కర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రతి విలేజ్, వార్డు క్లినిక్‌లో 105 రకాల అవసరమైన మందులు, 14 రకాల డయాగ్నస్టిక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో 48,639 మంది వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని నియమించామని, విలేజ్ క్లినిక్‌ల నుంచి బోధనాసుపత్రుల వరకు అవసరమైన సంఖ్యలో వైద్యులు, నర్సులు, పారామెడిక్స్ ఉండేలా చూసుకున్నామని అన్నారు. సమ్మిళిత వృద్ధి లక్ష్యాన్ని సాధించడానికి మహిళా సాధికారత చాలా కీలకమని, మహిళలకు ఆర్థిక వనరులు, అవకాశాలను పెంపొందించడానికి, ఏపి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు.



కేంద్ర జలశక్తి మంత్రితో సిఎం భేటీ

పోలవరం నిధుల కోసం కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్‌తో సిఎం జగన్ శనివారం భేటీ అయ్యారు. పోలవరం నిధులు, అంచనా వ్యయంపై చర్చించారు. ఈ మేరకు వినతిని అందజేశారు.

ఎస్‌ఎల్ ఫ్యాక్టరీలో విషవాయువులు లీక్

- ముగ్గురికి అస్వస్థత
- విజయవాడ జిజిహెచ్‌కు తరలింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట, విజయవాడ అర్బన్

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని ఎస్‌ఎల్ ఫార్మా స్యూటికల్ కెమికల్ కంపెనీలో విషపూరిత వాయువులు వెలువడి ముగ్గురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన శివ ప్రసాద్, అస్సాం రాష్ట్రానికి చెందిన జిహిరుల్ రెహమాన్, అబీబ్ విషవాయువు పీల్చి అస్వస్థతకు గురవ్వడంతో వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పారిశ్రామిక అధికారులు ఎస్‌ఎల్ కంపెనీని పరిశీలించారు. అనంతరం ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ ఎ.రవీంద్రరావు మాట్లాడుతూ ఎస్‌ఎల్ ల్యాబ్స్ ఫార్మాస్యూటికల్ కంపెనీ నిర్మాణానికి మాత్రమే అనుమతులు ఇచ్చామని, ఉత్పత్తులకు ఇంకా అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అనుమతులు లేకుండా కంపెనీలో ఉత్పత్తి ప్రారంభించడంపై విచారణ జరుపుతామని, అస్వస్థతకు గురైన కార్మికుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపుతామని తెలిపారు. ప్రస్తుతం కంపెనీలో ఉత్పత్తిని నిలుపుదల చేయించామని, యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎన్‌టిఆర్ కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.



అస్వస్థతకు గురైన కార్మికుడిని అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ప్రాణాలను హరించే ఫ్యాక్టరీలను నిషేధించాలి : సిపిఎం డిమాండ్

ప్రమాదానికి కారణమైన ఫ్యాక్టరీని సిపిఎం నాయకులు సోమోజు నాగమణి, షేక్ గౌస్‌మియా, ఎస్ రామనాథన్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను హరించే కంపెనీలను నిషేధించాలని డిమాండ్ చేశారు.

పోలీస్ మార్క్ విచారణ

- ఆస్పత్రి పాలైన బాధితుడు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్ (బాపట్ల జిల్లా)

విచారణ పేరుతో పోలీస్ అధికారులు విచక్షణారహితంగా కొట్టడంతో చోరీ కేసులో నిందితుడు ఆస్పత్రి పాలైన ఘటన శనివారం బాపట్ల జిల్లా మార్టూరు మండల పరిధిలోని చిమ్మిరిబండ గ్రామంలో వెలుగుచూసింది. బాధితుడు, ఆయన కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. చిమ్మిరిబండ గ్రామానికి చెందిన చిన్నగోని వెంకన్న ఇంట్లో రూ.43 వేలు నగదు అపహరణకు గురైంది. అదే గ్రామానికి చెందిన ఎస్‌సి కాలనీకి చెందిన మురుగుల లక్ష్మయ్యపై అనుమానం వ్యక్తం చేస్తూ.. వెంకన్న కుమారులు నవీన్, నాగేంద్రబాబు ఈ నెల 24న మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 25న రాత్రి లక్ష్మయ్యను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్‌ఐ విచారించారు. పోలీస్ మార్క్‌తో విచారించడంతో భయపడి.. లక్ష్మయ్య చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నగదును జూన్ 15 లోపు వెంకన్న కుటుంబానికి ఇవ్వాలని, లేకపోతే మరలా పోలీస్ మార్క్ కోటింగ్ ఉంటుందని పోలీసులు హెచ్చరించి ఇంటికి పంపించినట్లు బాధితుడు మీడియాకు తెలిపాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురైన లక్ష్మయ్యను కుటుంబసభ్యులు మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు.

పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలి

- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఆదివాసీ మహిళను రాష్ట్రపతి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాని మోడీ.. పార్లమెంటు భవనాన్ని ద్రౌపది ముర్ముతో ప్రారంభింపజేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం (ఎఐఎస్‌టిఇఎ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొరబు సత్యనారాయణ, దినారి ప్రభాకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీల పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పి 2019 పార్లమెంటు ఎన్నికల్లో 47 స్థానాలకు గానూ 42 ఎంపి స్థానాలు బిజెపికి ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన బిజెపి ఆదివాసీలకు రక్షణగా ఉండక పోగా, అటవీహక్కుల చట్టాన్ని' సవరణ చేసి గిరిజనుల నడ్డి విరిచారని పేర్కొన్నారు.

సక్రమమైతే వీటికి సమాధానం చెప్పండి

హిందూజాకు చెల్లింపులపై సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు హిందూజాకు అక్రమంగా రూ.1,234 కోట్లు చెల్లించిన అంశాన్ని సమర్థించుకుంటున్న ఇంధనశాఖ కార్యదర్శి విజయానంద్, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు హిందూజా సంస్థకు అక్రమ చెల్లింపులపై విద్యుత్‌శాఖ మాత్యులకు, ఇంధనశాఖ ఉన్నతాధికారులకు బాబూరావు శనివారం ప్రశ్నావళిని సందించారు. అక్రమ చెల్లింపులను సమర్థించుకునేందుకు వాస్తవాలను వక్రీకరించేలా, పాక్షిక సత్యాలతో, ప్రజలను తప్పుదారి పట్టించే రీతిలో చెబుతున్నారన్నారు. రూ.1,234.68 కోట్ల చెల్లింపులు సక్రమమైతే, వాటికి సంబంధించిన జిఓలు, ఉత్తర్వులు ఇంతకాలం ఎందుకు రహస్యంగా వుంచారని ప్రశ్నించారు. వాస్తవాలను విద్యుత్ నియంత్రణ మండలి ముందు ఎందుకు పెట్టలేదన్నారు. చెల్లింపుల అంశం విద్యుత్ నియంత్రణ మండలి పరిధిలో లేనపుడు హిందూజా కంపెనీ మండలి ముందు రివ్యూ పిటిషన్ ఎందుకు వేసిందో చెప్పాలన్నారు. రివ్యూ పిటిషన్ విచారణ జరుగుతుండగా పంపిణీ సంస్థలు డబ్బును ఎలా చెల్లించాయని ప్రశ్నించారు. హిందూజాకు చెల్లింపులు చేసిన తర్వాత ప్రజల వద్ద నుంచి ట్రూ అప్ ఛార్జీల పేరుతో వసూలు చేసుకోవటానికి మండలి అనుమతి తీసుకుంటామని ప్రకటించటం ఏమిటని ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థకు మేలు చేసే రీతిలో అక్రమ చెల్లింపులు చేసి ఆ భారాన్ని పజలపై మోపడం సరైందికాదని పేర్కొన్నారు. వినియోగించుకున్న విద్యుత్‌కు అదనపు చెల్లింపులు, ఉత్పత్తి చేయని విద్యుత్‌కు చెల్లింపులు చేయాలని కోర్టులు ఆదేశాలు ఇచ్చాయని రుజువు చేయాలన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలకు సబ్సిడీలు సకాలంలో చెల్లించకుండా వేలకోట్ల రూపాయలను బకాయిలు పెట్టే ప్రభుత్వం హిందూజా సంస్థకు అదనపు చెల్లింపుల కోసం ఆగమేఘాలపై ఎందుకు ఆదేశాలు ఇచ్చిందని ప్రశ్నించారు. అక్రమ చెల్లింపుల కోసం రుణం తీసుకోవడానికి అనుమతి, కౌంటర్ గ్యారెంటీ ఎందుకు ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వ పెద్దలకు ఇందులో ప్రత్యేకమైన ఆసక్తి ఎందుకని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలలో అక్రమాలు జరిగాయని, వాటిని పున:సమీక్షిస్తామని చెప్పిన వైసిపి ప్రభుత్వం ఇపుడు అదనపు మొత్తాలను, అక్రమంగా హిందూజా సంస్థకు చెల్లించాలని ఆదేశాలు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్ని డాక్యుమెంట్లనూ ప్రజల ముందు వుంచాలని డిమాండ్ చేశారు. అక్రమంగా హిందూజా సంస్థకు చెల్లించేలా ఇచ్చిన ఆదేశాలు రద్దు చేసి, చెల్లించిన డబ్బును తిరిగి రాబట్టాలని డిమాండ్ చేశారు.

మోడీ పాలనలో నిరుద్యోగం రెట్టింపు

- డివైఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎఎ రహీం, హిమాగ్నరాజ్ భట్టాచార్య
- హైదరాబాద్‌లో కేంద్ర కమిటీ సమావేశాలు ప్రారంభం



కేంద్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న హిమాగ్నరాజ్, వేదికపై రహీం తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం రెట్టింపయ్యిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జాతీయ అధ్యక్షులు ఎఎ రహీం, ప్రధాన కార్యదర్శి హిమాగ్నరాజ్ భట్టాచార్య విమర్శించారు. నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపడం లేదన్నారు. రెండురోజులపాటు జరగనున్న డివైఎఫ్ఐ కేంద్రకమిటీ సమావేశాలు హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రపతి లేకుండా పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించటం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను బిజెపి ప్రభుత్వం పరిష్కరించడం లేదన్నారు. దీంతో కోట్లాది మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ ఆశ కల్పించిన మోడీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని తెలిపారు. జిఎస్‌టి, పెద్ద నోట్ల రద్దు తదితర ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా కోట్లాది మంది నిరుద్యోగులుగా మారారని పేర్కొన్నారు. విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల గురించి మాట్లాడకుండా మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులను హరిస్తున్నదని పేర్కొన్నారు. విద్యారంగంలో మతతత్వ భావాలను చొప్పిస్తూ చరిత్ర పాఠ్యాంశాలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నదని వివరించారు. జాతీయ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తొలగిస్తూ, ఆర్‌ఎస్‌ఎస్ అనుకూలమైన వారి అంశాలను చరిత్ర పాఠ్యాంశాలుగా చేర్చుతున్నదని తెలిపారు. జీవపరిణామ క్రమ సిద్ధాంతమైన డార్విన్ సిద్ధాంతాన్ని తీసేసి మూఢవిశ్వాసాలు అంధవిశ్వాసాలతో విద్యారంగాన్ని కలుషితం చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, వివిధ రాష్ట్రాల నుంచి పలువురు కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కేజ్రీవాల్, భగవంత్ మాన్ సింగ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు

ఎమర్జెన్సీని తలపిస్తున్న బిజెపి పాలన

- ఢిల్లీ, పంజాబ్ సిఎంలతో కెసిఆర్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి పాలన ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆనాటి స్థితికి.. దేశంలో ఇప్పుడున్న పరిస్థితికి పెద్దగా తేడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా విపక్షాలు పార్లమెంటులో గళమెత్తాలని కోరుతూ ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ పలు రాష్ట్రాల సిఎంలను కలుస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ సింగ్‌తో కలిసి హైదరాబాద్‌కు విచ్చేశారు. ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్‌తో వారు భేటీ అయ్యారు. అనంతరం వారు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి అరాచకాలు, ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతున్న మోడీ సర్కార్... వాటిని పని చేయనివ్వటం లేదని వాపోయారు. తామందరం కేజ్రీవాల్ తరపున నిలబడతామనీ, ఆయనకు మద్దతునిస్తామని స్పష్టం చేశారు.

ఇది యావత్ దేశ సమస్య : కేజ్రీవాల్

ఇప్పుడు తాము ఎదుర్కొంటున్న సమస్య... కేవలం ఢిల్లీకే పరిమితం కాదు, అది యావత్ దేశ సమస్యని ఆ రాష్ట్ర సిఎం కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ ప్రజలకు న్యాయం జరిగేంత వరకూ పోరాడుతామని చెప్పారు. తమ పోరాటానికి మద్దతు ప్రకటించిన కెసిఆర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కెసిఆర్ చెప్పినట్టుగా దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం చేయాలని పంజాబ్ సిఎం భగవంత్‌సింగ్ మాన్ తెలిపారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- సిఎంకు రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్నూలు విశ్వభారతి ఆస్పత్రి వద్ద జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయడంతోపాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, ఆర్‌టివి, స్టూడియోఎన్ మీడియా ప్రతినిధులను వైసిపి ఎంపి అవినాష్‌రెడ్డి అనుచరులు లాక్కెళ్లి హోటల్‌లో తీవ్రంగా కొట్టడం దుర్మార్గమన్నారు. ఈ మేరకు సిఎం వైఎస్ జగన్‌కు శనివారం లేఖ రాశారు. తక్షణమే ఆస్పత్రి వద్ద ఉన్న సిసిటివి పుటేజ్‌లను పరిశీలించి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటు భవన ప్రారంభోత్సవం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించాలని, అలా కాకుండా ప్రధాని మోడీ ప్రారంభించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఎంపి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోడీ తొమ్మిదేళ్ల పాలనా కాలంలో వైఫల్యాలపై తాము తొమ్మిది ప్రశ్నలు అడుగుతున్నామని, వాటికి మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిజెపి పాలనకు వ్యతిరేకంగా 'నవసాల్, నవ సవాల్' అనే పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, లామ్ తాంతియాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అప్పుల బాధలు భరించలేక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలో శనివారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్ల చిన్నబాలన్న (65) వ్యవసాయంలో నష్టాలు వస్తుండటంతో గొర్రెల వ్యాపారం ప్రారంభించారు. అందులోనూ అప్పులే మిగిలాయి. దాదాపు రూ.10 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ నేపథ్యంలో రుణదాతల ఒత్తిడి, అప్పులు తీరే దారిలేక తన పొలంలోనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు 3లోగా దరఖాస్తు

- సర్క్యులర్ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బదిలీల కోసం జూన్ 3లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ పేర్కొంది. ఈ మేరకు శనివారం ఆశాఖ ఎమ్‌డి లక్ష్మీశా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. జిల్లా పరిధిలో ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులు జూన్ 6న పరిశీలిస్తారు. అదేరోజు తిరస్కరించిన దరఖాస్తుల జాబితా వెల్లడిస్తారు. బదిలీ అయిన ఉద్యోగులకు కేటాయించిన మండలం లేదా పట్టణంలో వ్యక్తిగత కౌన్సెలింగ్ జూన్ 8, 9, 10 తేదీల్లో నిర్వహిస్తారు. బదిలీల్లో కొత్తగా కేటాయించిన సచివాలయం వివరాలతో బదిలీ సర్టిఫికెట్లను ఆయా రోజుల్లోనే జారీ చేస్తారు. జూన్ 10న బదిలీలకు సంబంధించిన అభ్యంతరాలను ఆయా జిల్లాల కలెక్టర్లకు తెలపొచ్చు. ఇతర జిల్లాల బదిలీలు కోరుకునేవారు జిల్లాల్లో సంబంధితశాఖ ఉన్నతాధికారులు ఖాళీల వివరాలను ఈ నెల 28న వెల్లడించనున్నారు. జూన్ 3న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పరిశీలన అనంతరం వేరే జిల్లాలకు బదిలీలు కల్పిస్తూ జూన్ 8న ఉత్తర్వులు జారీ చేస్తారు. వ్యక్తిగత కౌన్సెలింగ్ 8, 9, 10 తేదీల్లో నిర్వహిస్తారు. అభ్యంతరాలను 10న కలెక్టర్లకు తెలపొచ్చు అని ఉత్తర్వుల్లో తెలిపారు.

విఆర్‌ఒల బదిలీపై స్పష్టత ఇవ్వాలి : భూపతిరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రేడ్-1 విఆర్‌ఒలు గ్రేడ్-1కే వెళ్లాలని, గ్రేడ్-2 విఆర్‌ఒలు గ్రేడ్-2 పోస్టుకు వెళ్లాలని పేర్కొంటూ బదిలీల్లో అవకాశం కల్పించకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, విఆర్‌ఒలకు దగ్గర్లోని మండలాలు, మున్సిపాలిటీల్లో బదిలీకి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలివ్వాలని విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే గ్రేడ్-2 విఆర్‌ఒలు రూ.15 వేల జీతంతో దూర ప్రాంతాల్లో పనిచేస్తూ.. ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బదిలీ ప్రక్రియను జూన్ 10 వరకు పెంచి అందరికీ న్యాయం చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సిబిఐ అఫిడవిట్‌పై చట్టపరమైన చర్యలకు జగన్ యోచన!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తనపై ఉద్దేశపూర్వకంగా తెలంగాణ హైకోర్టులో తప్పుడు అఫిడవిట్లు సమర్పించినందుకు సిబిఐపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టపరమైన చర్యలకు యోచిస్తున్నట్లు తెలిసింది. హైకోర్టులో శుక్రవారం సిబిఐ వేసిన అదనపు కౌంటర్ అఫిడవిట్‌పై సిఎం ఆగ్రహంతో వున్నట్లు సమాచారం. వివేకానందరెడ్డి మరణవార్త మొదట వెలుగులోకి వచ్చిన సమయం 6:15 గంటల కంటే ముందే సిఎం జగన్‌కు తెలుసని సిబిఐ పేర్కొనడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది. ఈ హత్య కేసులో తనను అనవసరంగా ఇరికించేలా కౌంటర్ అఫిడవిట్లలో తనపై తప్పుడు ఆరోపణలు చేసి ప్రతిష్టను దెబ్బతీసినందుకు గానూ సిబిఐపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశాలపై న్యాయ నిపుణులతో ముఖ్యమంత్రి చర్చిస్తున్నట్లు సమాచారం.

రేపు జిఎస్‌ఎల్‌వి -ఎఫ్12 రాకెట్ ప్రయోగం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట (తిరుపతి)

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. సోమవారం ఉదయం 10.42 గంటలకు జిఎస్‌ఎల్‌వి -ఎఫ్12 రాకెట్‌ను ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ రాకెట్ ద్వారా ఎన్‌విఎస్ -01 నేవిగేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. శ్రీహరికోటలోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుంది. రాకెట్ ప్రయోగం జరిగిన 18 నిమిషాల నుండి 19 నిమిషాల మధ్య సమయంలో ఎన్‌విఎస్ -01 ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం 12 సంవత్సరాల పాటు సేవలు అందించే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించారు. ఆదివారం ఉదయం 6.30 నుంచి కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. ఎన్‌విఎస్ -01 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ ఇస్రో చైర్మన్ సోమనాథ్ సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకు ఒక నావిగేషన్ ఉపగ్రహం ప్రయో గించనున్నట్లు తెలిపారు. చంద్రయాన్ -3 జులైలో ఉంటుందని తెలిపారు.

ఉద్యమంపై బురదజల్లే ప్రయత్నం

- ప్రాంతీయ సదస్సులో ఎపి జెఎసి అమరావతి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్ (ఏలూరు జిల్లా)

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిజాయితీగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం సృష్టించిన ఉద్యోగులు లేని ఉద్యోగ సంఘం నాయకులతో తమ ఉద్యమంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు విమర్శించారు. ఎపి జెఎసి అమరావతి మూడో ప్రాంతీయ సదస్సు ఏలూరు జిల్లా చైర్మన్ కె.రమేష్ కుమార్ అధ్యక్షతన శనివారం ఏలూరులోని టుబాకో మర్చెంట్స్ ఫంక్షన్ హాలులో జరిగింది. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సమస్యలపై 80 రోజులుగా ఉద్యోగులు పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమం అంత ఉధృతమవుతుందని తెలిపారు. ఉద్యోగులు మరో చలో విజయవాడకు పిలుపునివ్వకముందే సమస్యలు పరిష్కరించాలని కోరారు. పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ..ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో స్పష్టత వచ్చే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో జెఎసి అసోసియేట్ రాష్ట్ర చైర్మన్ టివి.ఫణీపేర్రాజు, కోశాధికారి వివి.మురళికృష్ణనాయుడు పాల్గొన్నారు.

అది మహానాడు కాదు.. పెద్ద డ్రామా

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజమండ్రిలో టిడిపి మహానాడు కార్యక్రమాన్ని పెద్ద డ్రామాలా, రికార్డింగ్ డ్యాన్స్ కార్యక్రమంలా నిర్వహిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజమండ్రిలో మహానాడు వేదికగా చంద్రబాబు వెకిలిచేష్టలు చేస్తున్నారని విమర్శించారు. వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ నుండి పార్టీని, పదవిని లాక్కుని ఇప్పుడు దండలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆయన జీవించివున్నపుడు అవమానించిన టిడిపి నాయకులు ఇపుడు ఆయన ఫొటో లేకుండా వేదికలపై కూర్చోలేకపోతున్నారని అన్నారు. తమ ప్రభుత్వం నేరుగా పేదలకు రూ.2.10 లక్షల కోట్లను అందజేసిందని, చంద్రబాబు ఎంత ఖర్చుపెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తన హయాంలో ప్రజల మనసుల్లో నాటుకుపోయేలా ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేకపోయారని ఆరోపించారు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే సిబిఐ : పేర్ని నాని

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో సిబిఐ విచారణ అంతా చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లోనే జరుగుతోందని ఎమ్మెల్యే పేర్ని నాని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిబిఐ తప్పుడు దోవలో విచారణ చేస్తోందని తాము మొదటి నుంచీ చెబుతూనే వున్నామన్నారు. కొంతమంది కీలక అధికారులను చంద్రబాబు ఉసిగొల్పి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లడం, అవినాష్‌రెడ్డిని కేసులో ఇరికించేలా విచారణ చేస్తున్నారని విమర్శించారు.

ప్రజాశక్తి ఉద్యోగి సంతోష్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



సుశీల (ఫైల్)

ప్రజాశక్తి దినపత్రిక విశాఖ యాడ్స్ విభాగంలో పనిచేస్తున్న జి.సంతోష్‌కుమార్‌కు మాతృవియోగం కలిగింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తల్లి గోపాలశెట్టి సుశీల (80) శనివారం సాయంత్రం విశాఖలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిలో సంతోష్ 1992 నుంచి ప్రజాశక్తి ఎడివిటి విభాగంలో పని చేస్తున్నారు. సుశీల మృతదేహాన్ని ఆమె స్వస్థలమైన విజయనగరం జిల్లా సీతానగరం మండలంలోని అంటిపేట గ్రామానికి అంబులెన్సులో తరలించారు. సుశీల మృతికి ప్రజాశక్తి సిజిఎం వై.అచ్యుతరావు, ఎడిటర్ బి.తులసీదాస్, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, దసపల్లా గ్రూప్ ఆఫ్ హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మండవ రాఘవేంద్రరావు తదితరులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అంత్యక్రియలు ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు పునరావాస చర్యలు కోరుతూ

20 నుండి మహాపాదయాత్ర

మొదటి పేజీ తరువాయి

ముంపునకు, రీసర్వే పేరుతో కొత్తగా చేర్చిన 32 గ్రామాలకు ఎలాంటి పొంతన వుండటం లేదని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో కొత్త గ్రామాలతో కలిపి 45 గ్రామాల్లో ముంపు వున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తేల్చిందని, వాస్తవంగా గతేడాది వరదలకు 150 గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. పునరావాస కాలనీలు సైతం ఈ వరదల్లో మునిగిపోయిన వాస్తవాన్ని గమనిస్తే ఈ కాంటూరు లెక్కలు ఎంత తప్పుగా వున్నాయో అవగతమవుతుందన్నారు. కాంటూరు లెక్కలకు తుదిరూపం ఇచ్చేందుకు శాస్త్రీయ ప్రాతిపదికపై రీసర్వే చేసి పూర్తిస్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు నష్టపరిహారాన్ని రూ.6.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామన్న వాగ్దానం అమలు కాలేదన్నారు. ఈ నాలుగేళ్లలో ఆ ప్రాంతంలో భూముల విలువ పెరిగిందని, పెరిగిన విలువ ఆధారంగా ఎకరాకు రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023 సెప్టెంబరు నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పునరావాస ప్యాకేజీ అందించాలని కోరారు. పూర్తిస్థాయి పునరావాసం అమలయ్యే వరకూ ముంపు ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. గతేడాది వరదల్లో మునిగిపోయిన గ్రామస్తుందలందరికీ తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు జూన్ 20 నుంచి మహా పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

ఉత్సాహంగా మహానాడు ప్రారంభం

ప్రతినిధుల సభకు వేలాది మంది రాక • రాజమహేంద్రవరం హైవేపై 3 గంటల పాటు ట్రాఫిక్ రద్దీ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో టిడిపి మహానాడు శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ప్రతినిధుల సభ జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది ప్రతినిధులు తరలివచ్చారు. ఉదయం 8.30 గంటలకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చిత్తూరు విభాగంలోనూ, యువనేత నారా లోకేష్ గుంటూరు విభాగంలోనూ పేర్లు నమోదు చేయించుకున్నారు.

అనంతరం 11 గంటలకు చంద్రబాబు పతాకావిష్కరణ, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాలాపనతో మహానాడును ప్రారంభించారు. కార్యదర్శి నివేదికను ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో మరణించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంతాపంగా


ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

రెండు నిమిషాలు మౌనం పాటించారు. తొలుత ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ స్టాళ్లను, వైద్య శిబిరాలను చంద్రబాబు ప్రారంభించారు. ప్రతినిధుల సభకు ఆ పార్టీ శ్రేణులు అంచనా వేసినట్లుగానే సుమారు 15 వేల మంది హాజర య్యారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలోని జాతీయ రహదారిపై ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ట్రాఫిక్ రద్దీ నెలకొంది. వాహనాలతో పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి. దీంతో, ప్రాంగణానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే పోలీసులు వాహనాలు నిలిపి వేయడంతో ప్రతినిధులు ఇబ్బందులు పడ్డారు.

నేడు భారీ బహిరంగ సభ

మహానాడులో భాగంగా ఆదివారం భారీ బహిరంగ సభ జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ఈ సభ ప్రారంభం కానుంది. రాష్ట్ర నలుమూలల నుంచి టిడిపి అభిమానులు, కార్యకర్తలు సుమారు 15 లక్షల మంది తరలిరానున్నారని ఆ పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. వారందరికీ భోజన ఏర్పాట్లు చేస్తున్నాయి.


మహానాడు ప్రాంగణం వద్ద కార్యకర్తలతో లోకేష్

పనితీరు ఆధారంగానే టికెట్లు

చంద్రబాబే ఖరారు చేస్తారు : లోకేష్

ప్రజాశక్తి- ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం రాజమహేంద్రవరం)

పనితీరు ఆధారంగానే వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్లు ఖరారు చేస్తామని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. తనతోసహా ఎవరికైనా పనిచేయకుండా టికెటు రాదన్నారు. రాజమహేంద్రవరంలోని మహానాడు ప్రాంగణం వద్ద విలేకరులతో శనివారం ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తన పాదయాత్రలో నేతలతో చేయి ఎత్తించినంత మాత్రాన టికెట్ ఖరారు అయినట్టు కాదని స్పష్టం చేశారు. చంద్రగిరి తర్వాత అభ్యర్థుల ప్రకటన చేయడం నిలిపివేశానని తెలిపారు.

రాయలసీమలో త్వరలో తన పాదయాత్ర పూర్తి కానుందని, కడప జిల్లాతో పూర్తవుతుందని, చివరి రోజు రాయలసీమ రోడ్డు మ్యాప్ ప్రకటించబోతున్నామని చెప్పారు. టిడిపికి సీమపై ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేసేందుకే ఈ రోడ్ మ్యాప్ అని తెలిపారు. నీటిపారుదల, తాగునీరు, పరిశ్రమలు, ఉపాధి అంశాలతో ఈ మ్యాప్ ఉంటుందని చెప్పారు. ఆ ప్రాంత ప్రజలు తమ వైపే ఉన్నారని అర్థమవుతోందని, కర్నూలులో మరింత స్పష్టంగా కనిపించిందని అన్నారు. వైసిపి నాయకత్వం ఆ పార్టీ కార్యకర్తలను గాలికి వదిలేసిందని చెప్పారు. ఆ పార్టీ నుంచి అనేక మంది సీట్ల కోసం టిడిపి వైపు చూస్తున్నారని, ఇందులో ఎమ్మెల్యేలు, ఎంపిలు ఉన్నారని తెలిపారు. పార్టీ కోసం స్వచ్ఛందంగా పనిచేసే వారు ఎవరొచ్చినా ఆహ్వానిస్తామని, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో కలిసే పనిచేయమని చెబుతామని అన్నారు. పనిచేయని ఇన్‌ఛార్జులే అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నారని, వారు పనిచేస్తే భయమెందుకని పేర్కొన్నారు.

బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. టిడిపిలో సముచిత గౌరవ స్థానం, గౌరవం పొంది స్వార్థంతో పార్టీని వీడిన కొందరు మరలా వస్తామని చెబుతున్నారని తెలిపారు. ఇటువంటి వారు తమకు అవసరం లేదన్నారు. మంగళగిరిలో పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి అమరావతిలో స్థలాలు కేటాయించారని, అయితే, ఇంటి నిర్మాణం పూర్తి కాకుండానే ఉంటున్న స్థలాల్లో నుంచి ఖాళీ చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అమరావతిలో ఆర్-5 జోన్‌లో వెంటనే ఇళ్లు నిర్మించాలని పేదపై ఒత్తిడి తీసుకురావడం కోర్టు తీర్పుకు విరుద్ధమన్నారు. జగన్ హయాంలో ఇళ్లు కట్టుకున్న పేదలు అప్పుల ఊబిలో కూరుకుపోయారని తెలిపారు. ఇప్పుడుంటున్న వారు మరో చోటికి వెళ్లి నివాసం ఏర్పరచుకొని ఉపాధి కోసం తిరగాల్సి ఉంటుందన్నారు. రాజధానిలో జగన్ ఇచ్చిన సెంటు భూమి ధర పెరగాలంటే తమ పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని లబ్ధిదారులు కోరుకుంటున్నారని చెప్పారు. గతంలో సంక్షేమం ఎక్కువ చేశామని, తక్కువ చెప్పుకుంటున్నామని పేర్కొన్నారు. వైసిపి తక్కువ సంక్షేమం చేసి, ఎక్కువ చెప్పుకుంటోందని విమర్శించారు.

ప్రజల పక్షానే టిడిపి

మహానాడులో అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం రాజమండ్రి)

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా టిడిపి ఎప్పుడూ ప్రజల పక్షమేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో ఆయన స్వాగతోపన్యాసం చేశారు. 2019లో రాష్ట్ర ప్రజలు ఏమరపాటుతో పొరపాటు చేసి వైసిపికి అధికారమిచ్చారన్నారు. 151 స్థానాలు వచ్చాయన్న అహంకారం, అధికారమదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విధ్వంసపాలనకు శ్రీకారం చుట్టారని, దుర్మార్గాలకు తెరలేపారని విమర్శించారు. ఒక ప్రభుత్వంపై కొన్ని ప్రాంతాలు, కొన్ని వర్గాల్లో మాత్రమే వ్యతిరేకత ఉంటుందని, జగన్ పాలనను ఐదు కోట్ల మంది ప్రజలూ ఛీకొడుతున్నారని పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఏ రాజకీయ పార్టీపైనా, నాయకులపైనా వ్యక్తిగతంగా కక్షకట్టలేదన్నారు. సిద్ధాంతపరంగా ప్రజామోదంతో ముందుకెళ్లామని పేర్కొన్నారు. జగన్ సిఎం అయ్యాక రాష్ట్రంలో వైసిపి తప్ప, మరో పార్టీ ఉండకూడదని నాలుగున్నరేళ్లుగా ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇబ్బంది పెడుతూనే ఉన్నారని విమర్శించారు. మంత్రులుగా పనిచేసిన తనతోపాటు ఇతరులనైనా కక్షకట్టి తప్పుడు కేసులు పెట్టి హింసించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పేదవాడినని, టివిలు, బంగ్లాలు లేవని మోసపు మాటలతో ప్రజలను


స్వాగతోపన్యాసం చేస్తున్న అచ్చెన్నాయుడు

ముఖ్యమంత్రి వంచించడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి ప్రజలు తన్నుకు చావడానికే ఉత్తరాంధ్రకు రాజధాని అని మభ్యపెట్టారని, అమరావతిలో సెంటు పట్టాల పేరుతో ప్రజలను మోసగిస్తూ కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. మహానాడును అడ్డుకోవడానికి జగన్, ఆయన ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసిందన్నారు. టిడిపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రా ముఖ్యమంత్రులు ప్రజలను భయపెట్టే పనులు చేస్తున్నారే తప్ప, ఉపయోగపడే పనులు చేయడం లేదని విమర్శించారు. పసుపు జెండాలు చేతపట్టి యువతీయువకులు ముందు నడిస్తేనే తెలుగు రాష్ట్రాలకు, ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్‌టిఆర్ ఒక శక్తి అని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన ధీశాలి అని పేర్కొన్నారు.

పారదర్శక పాలన, ఆదర్శ రాజకీయాలు

టిడిపి రాజకీయ తీర్మానం

ప్రజాశక్తి- ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం)

పారదర్శక పాలన, ఆదర్శ రాజకీయాలు అనేది తమ విధానమని టిడిపి తన రాజకీయ తీర్మానాన్ని ప్రకటించింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని ఆ పార్టీ మరో పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి బలపరిచారు. రూ.500 నోట్లను కూడా రద్దు చేయాలని, టిడిపి అధికారంలోకి వస్తే ధరలు, ఛార్జీలు నియంత్రణలో ఉంచి పేదలపై భారం లేని వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని మహానాడులో తీర్మానించారు. ధరలు, పన్నులు, ఛార్జీల బాదుడే బాదుడు తీర్మానాన్ని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ప్రవేశపెట్టగా, సర్వసిద్ధి అనంతలక్ష్మి బలపరిచారు. ఈ తీర్మానంతోపాటు పలు తీర్మానాలను మహానాడు ఆమోదించింది. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలని డిమాండ్ చేసింది. రైతును దగా చేసిన జగన్మోహన్‌రెడ్డి పాలన-తీవ్ర సంక్షోభంలో వ్యవసాయం, నీటిపారుదల రంగం తీర్మానాన్ని ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రతిపాదించగా, మర్రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బీద రవిచంద్రయాదవ్ బలపరిచారు. అభివృద్ధి విధ్వంసం-జీరో డెవలప్‌మెంట్-ఇదేం కర్మ రాష్ట్రానికి తీర్మానంపై బి.రామాంజనేయులు, వేపాడ చిరంజీవి,


రాజకీయ తీర్మానం ప్రవేశపెడుతున్న యనమల

జి.దీపక్‌రెడ్డి మాట్లాడారు. రాక్షస పాలన, రాజకీయ రాబంధుల స్వైర విహారం తీర్మానంపై బొండా ఉమామహేశ్వరరావు, బిటెక్ రవి, డూండీ రాకేష్, పట్టాభిరామ్, వర్ల కుమార్‌రాజా, అసిటేలి నిర్మల మాట్లాడారు. మహిళ సంక్షేమంలో కోతలు-అడ్డూ అదుపులేని అత్యాచారాలు, హత్యలపై ఆదిరెడ్డి భవాని, మూల్పూరి కల్యాణి మాట్లాడారు. అమరులైన పార్టీ కార్యకర్తల సంతాప తీర్మానాన్ని తణుకు టిడిపి ఇన్‌ఛార్జి రాధాకృష్ణ ప్రవేశపెట్టారు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన ప్రధాన కార్యదర్శి నివేదికను పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రవేశపెట్టారు. కార్యకర్తల సంక్షేమంపై శిష్టా లోహిత్ నివేదికను ప్రవేశపెట్టారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాల్సిందే

- లైంగిక వేధింపులకు పాల్పడ్డ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ క్రీడాకారిణి పూజారి శైలజ, హాజరైన క్రీడా, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని, న్యాయపరమైన దర్యాప్తు నిర్వహించి అరెస్టు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును కాపాడాలని, తమకు భద్రత కల్పించాలని కోరుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు నిర్వహిస్తున్న పోరాటానికి ఈ సమావేశం మద్దతు తెలిపింది. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన మహిళా రెజ్లర్లు 35 రోజులుగా తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఢిల్లీ నడిబొడ్డున ఆందోళన నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తమకు అన్యాయం జరిగిందని బయటకు వచ్చిన మహిళలకు దన్నుగా నిలబడాల్సిందిపోయి లైంగిక వేధింపులకు ఒడిగట్టిన బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు అండగా ప్రభుత్వం నిలబడడం సిగ్గుచేటన్నారు. బాధితులపై భౌతికంగా దాడి చేయడం మహిళల రక్షణ పట్ల మోడీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని మండిపడ్డారు. మహిళా రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా స్పోర్ట్స్ అసోసియేషన్స్ అన్నీ కలిపి త్వరలో సంఘీభావ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఒలింపిక్స్‌లో రెండుసార్లు భారతదేశానికి ప్రాతినిథ్యం వహించి, కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన పూజారి శైలజ, చెస్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దండు నాగేశ్వరరావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.రాజారావు, ఫుట్‌బాల్ కోచ్ నరేష్, కరాటే సెల్ఫ్ డిఫెన్స్ కోచ్ కె.ఇజ్రాయిల్, వైజాగ్ అడ్వెంచర్ అండ్ వాటర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రెహమాన్, ఇంటర్నేషనల్ కబడ్డి ప్లేయర్ జెవి.లక్ష్మి, కిక్ బాక్సింగ్ ఛాంపియన్ భవాని సహా పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● **ఎదురు కాల్పులు :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో శుక్రవారం రాత్రి పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టుకు, బిఎస్ఎఫ్ జవాన్‌కు గాయాలయ్యాయి. పోలీస్ ఉన్నతాధికారి శలబ్ కుమార్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతాప్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఉపంజుర్ట్ గ్రామ సమీపంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో ఎదురు కాల్పులు జరిగాయి.

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)


ఎమ్మెల్యే రెడ్డి శాంతిని నిలదీస్తున్న గిరిజనులు

ఎమ్మెల్యేకు నిరసన సెగ

రెడ్డి శాంతిని అడ్డుకున్న గిరిజనులు

ప్రజాశక్తి - మెళియాపుట్టి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి గిరిజనుల నుంచి నిరసన సెగ తగిలింది. బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఆమె పర్యటనను అడ్డుకున్నారు. మెళియాపుట్టి మండలం జోడూరు పంచాయతీ పరిధిలోని అర్చనాపురం, జన్నిబంద, సజ్జనాపురం, నందలపాడులో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. తమ గ్రామాల్లోకి రావద్దని రహదారికి అడ్డంగా కర్రలు వేసి, గో బ్యాక్ ఎమ్మెల్యే అని ఫ్లకార్డులు ప్రదర్శించారు. బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో ఎలా చేరుస్తారని నిలదీశారు. గిరిజనులకు నష్టం చేసే విధంగా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పరంగా గిరిజనులకు ఏం చేశారని నిలదీశారు.

గ్రామాల్లో రహదారి సౌకర్యం లేదని, ఇళ్ల కాలనీ మంజూరు చేయలేదని, ఇతర సమస్యలేవీ పరిష్కరించలేదని చెప్పారు. అభివృద్ధి పనులు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని వస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేను అడ్డుకోవడాన్ని ఒక యువకుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, ఎమ్మెల్యే గన్‌మెన్ మొబైల్‌ను లాక్కొని వీడియోను డిలీట్ చేయడంతో గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుచరులు శాంతింపజేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో చివరకు ఆమె అక్కడ నుండి వెనుదిరిగారు.

నాపరాయి లారీ బోల్తా

- ముగ్గురు కార్మికుల దుర్మరణం

ప్రజాశక్తి-రేపల్లె (బాపట్ల జిల్లా)

నాపరాయి లారీ బోల్తా పడి ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా రేపల్లె మండలం రావి అనంతవరం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. సిఐ విజయచంద్ర తెలిపిన సమాచారం ప్రకారం.. పల్నాడు జిల్లా మాచర్ల నుంచి బాపట్ల జిల్లా రేపల్లెకు నాపరాయి లోడ్‌తో లారీ బయలుదేరింది. లారీ క్యాబిన్‌లో ముగ్గురు వ్యక్తులు ఉండగా, లారీలోని నాపరాళ్లపై మరో ముగ్గురు కార్మికులు ఉన్నారు. రేపల్లె మండల పరిధిలోని రావి అనంతవరం గ్రామ సమీపంలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లి రెండు ఫల్టీలు కొట్టింది.

ఈ ప్రమాదంలో లారీపైన ఉన్న రెంటచింతల మండలం పాశర్లపాడు గ్రామానికి చెందిన కార్మికులు చింతమల్ల చెన్నకేశవులు (40), సాంబశివరావు (60), పఠాన్‌వలి (35)పై నాపరాళ్లు పడడంతో వారు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. క్యాబిన్లో ఉన్న పాశర్లపాడుకు చెందిన గుడిపల్లి చిన్న సుబ్బాయ్య, చల్ల చినకాసాల, రెంటచింతల మండలం మిత్తగూడిపాడుకు చెందిన సైదారావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన
బ్రాంచి ఆఫీసు బదిలీ

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ రిజిస్టర్డు కార్యాలయము, ముంబయి - పూణే రోడ్డు, అకుర్డీ, పూణె - 411035 మరియు కార్పొరేటు కార్యాలయము 4వ అంతస్తు, బజాజ్ ఫిన్ సెర్వ్, విమాన్ నగర్, పూణె - అహ్మద్‌నగర్ రోడ్డు, పూణే, మహారాష్ట్ర-411014 వారు ఇందుమూలముగా తమ ఖాతాదారులకు మరియు సంబంధించిన వారికి తెలియజేయునది ఏమనగా తమ కార్యాలయం **బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం. 9-12-1, 1వ అంతస్తు, ఎస్ ఆర్ ప్లాజా, కోర్టు బిల్డింగ్ స్టేషన్ రోడ్డు ఎదురుగా, నరసారావుపేట-522601** వారు **తేది.03.06.2023** నుండి సదరు కార్యాలయంలో జరిగే గోల్డ్ లోన్ సేవలను మూసివేసి మా నూతన బ్రాంచి చిరునామా **బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, 9-1-73, స్టేషన్ రోడ్డు, అరుండాల్‌పేట, నరసారావుపేట-522601** నందు గోల్డ్ లోన్ సేవలు అందుబాటులో ఉంటాయి. గోల్డ్ లోన్ సంబంధిత సేవలు & సందేహాల కొరకు మా బ్రాంచి ఖాతాదారులందరూ మరియు సంబంధించినవారు మార్పు గమనించి మా నూతన గోల్డ్ లోన్ కార్యాలయం **బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, 9-1-73, స్టేషన్ రోడ్డు, అరుండాల్‌పేట, నరసారావుపేట-522601** వద్ద ఇప్పటి నుండి సంప్రదించవలెను.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
4 వ అంతస్తు, బజాజ్ ఫిన్ సెర్వ్ కార్పొరేట్ ఆఫీస్, పూణె - అహ్మద్ నగర్ రోడ్, విమాన్ నగర్, పూణె, మహారాష్ట్ర 411 014, ఫోన్: 020-71505050
ప్రదేశం : నరసారావుపేట తేది : 27.05.2023

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.

FORM – 17
(See Rule No. 53 of the Second Schedule to the Income Tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION
R.P. No.362 of 2019 in OA No.434 of 2018
Canara Bank, Chandramouli Nagar Branch, Guntur District
Versus
M/s. Vijaya Balaji Traders & Others

To
(CD-1) M/s. Vijaya Balaji Traders, Rep by its Prop. Sri K.Narasaiah, C/o Gopala Krishna Cotton Ginning Mill, Unit-3, Mahalakshmipuram, Etukuru Road, Guntur.
(CD-2) Sri Kotapati Narasaiah, S/o K. Erukalaiah, Flat No.105, Brundavan Enclave, DS Nagar, Etukuru Road, Guntur.
(CD-3) Smt. Kompati Rama Lakshmi, W/o Narasaiah, Flat No.105, Brundavan Enclave, DS Nagar, Etukuru Road, Guntur.
(CD-4) Sri Kotapati Venkata Rao, S/o Sriramulu, D.No.9-5A-216, 2nd Line, Adityanagar, Reddypalem Road, Guntur.
(CD-5) Sri Kotapati Satyanarayana, S/o K. Sri Ramulu, D.No.9-5A-216, 2nd Line, Adityanagar, Reddypalem Road, Guntur.

Whereas in execution of Recovery Certificate dated 06.03.2020 in O.A. No. 434/2018 for Rs.1,42,45,845.68 ps. with future interest @ 11.45% p.a. with compounded monthly rests from 13.03.2018 till realization forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors/ Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.

SPECIFICATION OF PROPERTIES
SCHEDULE-A: All that part and parcel of site measuring to an extent of 100.1 sq.yards, covered by D.no.113/A nearby door no.26-40-3, situated in Nallapadu village, within the limitation of Guntur Municipal Corporation area, Nallapadu sub-district, Guntur District, bounded by: East: Balance site of Sammohiniees Prasada Rao, South: Balance site of Sammohiniees Koteswara Rao, West: 40 feet wide Municipal Road, North: Balance site of Sammohiniees Prasada Rao.
SCHEDULE-B: All that part and parcel of site measuring to an extent of 291 sq.yards, covered by D.no.356/A2, situated in Aditya Nagar 1st line near to Santhi Arts, Reddypalem Road, Guntur, Guntur SRO, Guntur District and bounded by: East : Site of Mannem Basava Poornamma, South Property of Cherukupalli China Kotaiah West: Site of Balinedi Yalla Reddy, North: 30 feet wide Municipal Road.
SCHEDULE-C: All that part and parcel of vacant site admeasuring to an extent of 724.5 sq.yards, covered by D.no.42-2A1A, in plot no.2,3,4, situated at Vaddavalli Village, Satenapalli Municipal Limits, Sattenapalli Sub-district, Narasaraopet Registration District, Guntur District. bounded by: East: 22 feet width Road, South: Plot no.5, West: Land belongs to Bathula Rosamma, North: Plot no.1.
Given under my hand and seal of this Tribunal at Visakhapatnam on the 17th May, 2023
(B.N.S.V.S.K. Bangarraju) Recovery Officer-II
Debts Recovery Tribunal, Visakhapatnam

IKF Home Finance
ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
ప్లాట్ నం.30/ఎ, సర్వే నం.83/1, మై హోమ్ ట్విజా, 11వ అంతస్తు, డైమండ్ హిల్స్, లుంబిని అవెన్యూ, 400/220/132కెవి ప్రక్కన, జిఐఎస్ సబ్‌స్టేషన్, ఎపిఐఐసి హైదరాబాద్, నాలెడ్జి సిటీ, రాయిదుర్గ్, హైదరాబాద్-081. ఫోన్:040-23412083

స్వాధీనతా ప్రకటన
సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) చదువుతూ అనుబంధం- IV కింద
రుణ ఖాతా నెం: LNVJY01019-200001612

[illegible]

షెడ్యూలు-ఏ: స్థిరాస్తుల యొక్క వివరణ:
ఎనికేపాడు గ్రామం& జిపి, విజయవాడ రూరల్ మండలం, క్రిష్ణ జిల్లా-521108, ఆం.ప్ర వద్దగల ఆర్.ఎస్.నెం.213/6, (ప్లాన్ ప్రకారం) డోర్ నెం.9-81, దగ్గరలోని డోర్ నెం.9-73/5పై జ్ఞానశ్రీ రెసిడెన్సీలో 20చ.అ.ల విస్తీర్ణపు ఒక టు వీలర్ కార్ పార్కింగ్ మరియు ఉమ్మడి ఏరియా, 60చ.అ.ల ప్లింత్ ఏరియా 340చ.అ.ల విస్తీర్ణపు మొదటి అంతసులోని ఫ్లాట్ నెం.ఎఫ్‌ఎఫ్-3 నివాసం లేదా 189చ.అ.ల విస్తీర్ణపు ఆర్‌సిసి బిల్డింగ్ మరియు స్థలం మొత్తం భాగం. **స్థలానికి సరిహద్దులు:** ఉత్తరం: పొదిలి నరసింహా రావు ఆస్తి-45.60అ.లు, దక్షిణం: బత్తిన వెంకటేశ్వర రావు ఆస్తి-38.0అ.లు, తూర్పు: 6.0వెడల్పు రోడ్-44.30ల.లు, పడమర: నాయని రామతకారం ఆస్తి-38.0లు. **ఫ్లాట్ సరిహద్దులు:** ఉత్తరం: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఫ్లాట్ నెం.ఎఫ్‌ఎఫ్4, తూర్పు: ఒపెన్ టు స్కై, పడమర: ఉమ్మడి కారిడార్& మెట్లు. పై నాలుగు సరిహద్దుల మధ్యలో ఐటం 1కు సైటు యొక్క 189చ.గ.లు 14చ.గ.ల యుడిఎస్ అన్ని ఈస్‌మెంట్ హక్కులతో.
తేది: 26.05.2023, ప్రదేశం: క్రిష్ణ సం/- అధీకృత అధికారి, ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్.

FORM NO.14
{See Regulation 33(2)}
OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
RC/719/2018 in OA 476 of 2017 **10.05.2023**
Canara Bank, Chandramouli Nagar Branch, Mayuri Homes, Guntur District
Versus
M/s Siva Naga Cotton Syndicate and others

To
(CD-1) M/s Siva Naga Cotton Syndicate, Rep. by its Prop. Sri Gude Nagaiah @ Peddanna, D.No.24/37/30/1, Backside of Srinivasa Weigh Bridge, Etukuru Road, Guntur District.
(CD-2) Sri Gude Nagaiah @ Peddanna, S/o Venkata Swamy, D.No; 24/37/30/1, Backside of Srinivasa Weigh Bridge, Etukuru Road, Guntur District.
(CD-3) Smt Gude Subbulu, W/o Sri Gude Nagaiah @ Peddanna, D.No; 24/37/30/1, Backside of Srinivasa Weigh Bridge, Etukuru Road, Guntur Dist.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in OA/476/2017 an amount of Rs.3,92,11,876/- (Rupees three crores ninety two lakhs eleven thousand eight hundred and seventy six only) along with pendentellite and future interest @ 11.70% p.a. compounded with Monthly rests from 16.06.2017 till date of payment /realization along with costs of Rs. 1,95,000/- has become due against you (Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **26/06/2023** at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

Given under my hand and the seal of the Tribunal, on this date: 10.05.2023
(Avasarala Anil) Recovery Officer

సంపాదకీయం


కృత్రిమ మేధస్సు

'మన కలలను సాకారం చేసుకోవడానికి, మనం ఊహించలేని వాటిని సృష్టించడానికి ఉపయోగించే ఒక సాధనం– టెక్నాలజీ' అంటాడు లైనక్స్ కెర్నల్ సృష్టికర్త లైనస్ టోర్వాల్డ్. సాంకేతిక పురోగతిలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) ఆవిష్కరణ ఒక గేమ్ ఛేంజర్. ఇది మన చుట్టూ ఉన్న ప్రపంచంతో మనం జీవించే, పనిచేసే, సంభాషించే విధానాన్ని మార్చింది. స్వీయ డ్రైవింగ్ కార్ల నుండి వర్చువల్ అసిస్టెంట్ల వరకు, ఏఐ సామర్థ్యం, కచ్చితత్వం– మొత్తం మానవ అనుభవాన్ని మెరుగుపరచడంలో విశేషమైన పురోగతిని సాధించింది. అయినప్పటికీ, కృత్రిమ మేధ యుగాన్ని మరింత లోతుగా పరిశోధిస్తున్నప్పుడు, దానివల్ల ఎదురయ్యే సమస్యలను పరిశీలించడం చాలా ముఖ్యం. దాని శక్తిని బాధ్యతాయుతంగా, నైతికంగా ఉపయోగించేలా చూడటం మరింత కీలకం. 'టెక్నాలజీ ఉపయోగకరమైన సేవకుడు, కానీ ప్రమాదకరమైన మాస్టర్' అంటాడు నార్వే చరిత్రకారుడు క్రిస్టియన్ లౌస్ లాంగే. మంచి పనులు చేయడానికి ఉపయోగించిన రోబోను... చెడ్డపనులకు ఎలా ఉపయోగించారో 'రోబో' సినిమాలో చూస్తాం. కృత్రిమ మేధ ఎంత పురోగతి సాధించినా... వాటంతటఅవి అపకారం చేయలేవు. ఏదైనా మంచిగాని, చెడుగానీ జరిగిందంటే, అది వాటిని సృష్టించిన మనిషి వల్లే.

'మనిషి చేయగల ఏ పని అయినా మెషీన్స్ మరో 20ఏళ్లలో చేస్తాయి' అని ప్రముఖ శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత హెర్బర్ట్ సైమన్ 1965లోనే అన్నాడు. నేడు మనిషి చేసే అన్ని పనులు యంత్రాలు చేయగలుగుతున్నాయి. విద్య, వాణిజ్యం, వైద్యం, మిలిటరీ, పరిశోధన వంటి రంగాల్లో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తెచ్చింది. ఇప్పటికే చాలా దేశాల్లో ఏఐ ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. రోగనిర్ధారణలో ఏఐ మెరుగైన సేవలు అందిస్తోంది. ముఖ్యంగా వైద్యులకు సహాయం చేయడంలో, మానవ తప్పిదాలను తగ్గించడంతోపాటు కృత్రిమ మేధతో నడిచే రోబోలను శస్త్రచికిత్సలలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అలాగే, ఇటీవల ప్రాచుర్యం పొందిన చాట్ జీపిటీ వల్ల ఎలాంటి అద్భుతాలు జరుగుతాయోననే ఉత్సుకత ఒకవైపు వున్నా, ఎలాంటి అనర్థాలు సంభవిస్తాయోననే ఆందోళన కూడా నెలకొంటోంది. ఇప్పటికే సాంకేతిక విజ్ఞానం ప్రభావం ఉద్యోగులపై కనిపిస్తోంది. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి రంగాల్లో ఏఐ ప్రభావం కచ్చితంగా వుంటుందని నిపుణులు అంటున్నారు. అయితే, 'కృత్రిమ మేధస్సు మానవాళికి ముప్పు కాదు. ఇది మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి, సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి, మానవ జీవితాలను మెరుగుపర్చడానికి మేము రూపొందిస్తున్న సాధనం' అంటారు అమెరికన్ కంప్యూటర్ శాస్త్రవేత్త ఫే ఫే లి. అదే సమయంలో ఏఐ వల్ల గోప్యత, ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఆందోళనకర రంగా మారింది. గోప్యతను పరిరక్షించడం, డేటా రక్షణను నిర్ధారించడం చాలా కీలకం. ఏఐ శక్తిని ఉపయోగించుకోవడం– వ్యక్తిగత స్వేచ్ఛను రక్షించుకోవడం మధ్య సమతుల్యతను సాధించడం చాలా ముఖ్యం.

'పూర్తి కృత్రిమ మేధస్సు అభివృద్ధి మానవ జాతి అంతానికి దారితీస్తుంది' అంటాడు స్టీఫెన్ హాకింగ్. వాస్తవానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాలను పెంచుకునేందుకు వీలు కల్పించేలా ఉత్పత్తి ప్రక్రియలో శారీరక, మానసిక శ్రమను తొలగించేందుకు ఒక సాధనంగా కృత్రిమ మేధస్సు రూపొందించబడింది. ఇది శ్రామికులను భారీగా తగ్గిస్తుంది. దోపిడీని తీవ్రతరం చేస్తుంది. ఇటీవలి కాలంలో దీని వేగం, విస్తరణ... ఇదివరకెన్నడూ ఊహించని రంగాలపై కూడా ప్రభావం చూపుతోంది. దీన్ని అదుపు చేయడానికి ఒక అంతర్జాతీయ నియంత్రణ వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం వుంది. దీని ప్రభావం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంపై కనిపిస్తున్నది. 'ఏఐ అగ్ని లాంటింది. ఇది చాలా ఉపయోగకరంగా వుంటుంది. కానీ, మనం జాగ్రత్తగా వుండాలి' అంటాడు ట్విటర్ అధినేత అలెన్ మస్క్. ఏఐ అపరిమితమైన అవకాశాలతో కొత్త శకానికి నాంది పలికినమాట వాస్తవం. అయితే, దీనివల్ల ఎదురయ్యే సవాళ్లను సవ్యంగా పరిష్కరించడం అవసరం. సమాజ శ్రేయస్సును నిర్ధారించేటప్పుడు కృత్రిమ మేధస్సు యొక్క సామర్థ్యాన్ని పెంచడంలోని సృజనాత్మకత – నైతికత మధ్య సమతుల్యతను సాధించడం కీలకం. నైతికతను పాటించడం ద్వారా, మానవాళికి ప్రయోజనం చేకూర్చే కృత్రిమ మేధ ఆధారిత భవిష్యత్తుకు మార్గం సుగమం చేయవచ్చు.

మహనీయుల మాట



అంధకారం నుంచి వెలుగులోకి మనల్ని నడిపించేదే విద్య

-అలెన్ బ్లూమ్
ప్రముఖ విద్యావేత్త

రాష్ట్రపతిని విస్మరించి రాజదండ ప్రతిష్ట

విశ్లేషణ

దేశ ప్రతిష్టకు ప్రతీకగా నిలవాల్సిన పార్లమెంటు భవన సముదాయం ప్రారంభోత్సవాన్ని ఏకపక్ష వ్యవహారంగా మార్చడం ప్రధాని నరేంద్రమోడీకే చెల్లింది. ఇరవైకి పైగా ప్రతిపక్షాలు హాజరు కాబోమని ప్రకటిస్తే కనీసం సంప్రదింపులకు కూడా ప్రయత్నించని అప్రజాస్వామిక పోకడలు దేశం ఎప్పుడూ చూసివుండదు. ఈ మధ్యనే లోక్‌సభ మాజీ కార్యదర్శి పిడిటి ఆచారి ప్రసంగాన్ని అనువాదం చేసినప్పుడు ఆయనో మాట చెప్పారు. నెహ్రూ హయాంలోనూ తర్వాత చాలా కాలం కూడా పార్లమెంటులో ఉద్రిక్తత వస్తే ప్రతిపక్ష నాయకులను పిలిచి చర్చించి ఏదో ఒక పరిష్కారం చేసేవారట. ఎందుకంటే సభ జరిగేలా చూడటం ప్రభుత్వాధినేత అయిన ప్రధాని బాధ్యత.కర్తవ్యం కూడా. మోడీ హయాంలో పార్లమెంటును ఒక తంతులాగా మార్చి పెత్తనం చేయడమే గాని ఎన్నడూ రాజ్యాంగం, సంప్రదాయం రీత్యా వ్యవహరించింది లేదు. కీలకమైన కాశ్మీర్ అంశం లాటిదాన్ని కూడా హఠాత్తుగా తెచ్చి మమ అనిపించడం తప్ప ముందుగా చర్చించే సాహసం ప్రజాస్వామ్య స్పృహ లేవు. నోట్ల రద్దు, ఎన్ఆర్‌సి వంటివాటిపై చర్చలకే అవకాశమివ్వని నిరంకుశత్వం ఈ సర్కారుది. అదే ఇప్పుడూ ప్రత్యక్షమవుతున్నది. అసలు న్యూ విస్తా పేరుతో నూతన భవన సముదాయాన్ని కట్టాలన్న నిర్ణయమే ఏకపక్షమైంది. దేశమంతా కరోనా మహమ్మారితో కలవరపడుతున్నప్పుడు తీసుకున్నది. చారిత్రకంగా కొనసాగుతున్న గొప్ప నిర్మాణాల స్థానంలో తన ముద్ర కోసమే అవసరం లేకున్నా లూట్యాన్స్ ఢిల్లీని మోడీస్ ఢిల్లీగా మార్చడమే ఏకైక లక్ష్యంగా ఈ తతంగం తలపెట్టారు. కోర్టులలో కేసులూ నడిచాయి. సాంకేతిక కారణాలతో అనుమతి సంపాదించి పూర్తి చేశారు. నూతన భవనంపై జాతీయ చిహ్నమైన మూడు సింహాల ప్రతిష్టాపన కూడా ఇలాగే హఠాత్తుగా ఒంటరిగా కానిచ్చేశారు. ఆ సింహాలు గతంలో వలె గంభీర ప్రసన్నంగా గాక క్రోధంగా వుండటం మరో చర్చకు దారితీసింది. దానిపై విమర్శల తర్వాత పూర్తిస్థాయి ప్రారంభోత్సవానికైనా పునరాలోచించుకొని అందరినీ కలుపుకుపోయే బదులు దీనికీ తనే ఏకైక కర్త కర్మ క్రియగా కానిచ్చేయడం మోడీకే చెల్లింది!



తెలకపల్లి రవి

రాష్ట్రపతి రాజ్యాంగ పాత్ర

పార్లమెంటు అంటే అన్నిపార్టీల సభ్యులూ వుండే వేదిక. రాజ్యసభ అయితే రాజ్యాంగ పరంగా రాష్ట్రాల సభ.కాని మోడీ సర్కారు దీనిని కేవలం ప్రభుత్వ వ్యవహారంగా మార్చేసింది. కాని ఇప్పుడీ ప్రారంభోత్సవ కార్యక్రమంపై విమర్శ వచ్చింది ప్రతిపక్షాల గురించి కాదు. రాష్ట్రపతి గురించి. భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం పార్లమెంటు ఉభయ సభల ఏర్పాటుకు, ప్రారంభానికి, ప్రోరోగ్ (నిరవధిక వాయిదా) కు ఎన్నికలకూ కర్త రాష్ట్రపతి. రాజ్యాంగంలో 3,111,274 అధికరణాలు రాష్ట్రపతి అధికారాలను స్పష్టంగా పేర్కొంటున్నాయి. 79వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి, సభ్యులు కలిస్తేనే పార్లమెంటు. పార్లమెంటు ఏర్పాటు ,గడువు ముగిసిన తర్వాత లేదా ప్రభుత్వం కోరితే పడిపోతే మళ్లీ కొత్త సభ ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు అనుమతి నివ్వడం రాష్ట్రపతి ద్వారానే జరుగుతుంది. ఎన్నికైన సభ్యుల జాబితాను తనకే అందజేస్తారు. 78వ అధికరణం మేరకు పార్లమెంటు ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి సంతకం చేస్తేనే శాసనాలవుతాయి. కనక రాష్ట్రపతికీ పార్లమెంటుకూ మధ్య సంబంధం విడదీయరానిది. అలాటి రాష్ట్రపతి లేకుండా, కనీసం ఆహ్వానించకుండా పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించాలనుకోవడం ఎలాటి ప్రజాస్వామ్య సంప్రదాయం? ఎలాటి రాజ్యాంగ గౌరవం? పైగా ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును తొలి ఆదివాసి మహిళ ఎన్నికగా గొప్పగా ప్రచారం చేసుకున్న మోడీ ప్రభుత్వం ఎందుకు ఆమెను గౌరవించడం లేదు? ఈ మాట అనగానే అయితే ప్రతిపక్షాలు ఎందుకు ఆమెపై అభ్యర్థిని పెట్టాయని కొందరు ఎదురు దాడి చేయడం మరీ విడ్డూరం.

ఆ స్థానంలో ఎవరుంటే వారు రాజ్యాంగ రీత్యా ఆ గౌరవానికి అర్హులు తప్ప ఎన్నికల్లో పోటీ పెట్టడం ఇక్కడ సమస్య కానేకాదు. ఇంకా కొంతమంది ఉదాహరణకు తెలంగాణ పాండిచ్చేరి రాష్ట్రాల గవర్నర్‌గా వున్న తమిళిసై సౌందరరాజన్ వంటివారు సచివాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కెసిఆర్ తనను ఆహ్వానించలేదని పోటీ వాదన తెస్తున్నారు.సచివాలయానికి గవర్నర్‌కు మధ్య అలాటి పాత్ర వున్నట్టు రాజ్యాంగం ఎక్కడైనా చెప్పిందా?తలాతోక లేని వాదన తప్ప! ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ల నిర్వాకాలను సుప్రీం కోర్టు తప్పు పట్టిన తర్వాత కూడా బిజెపి నియమిత వ్యక్తుల తీరు మారలేదనడానికి ఇదో ఉదాహరణ మాత్రమే.



పార్లమెంటు భవనం అనేది రాజకీయాలకు అతీతమైన విషయమన్నట్టు దాన్ని బహిష్కరించడం అపచారమన్నట్టు కొందరు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాధినేత అయిన ప్రధాని ప్రారంభిస్తే తప్పేంటని కొందరు మీడియా వ్యాఖ్యాతలు కూడా వంతపాడుతున్నారు. రాష్ట్రపతిని దేశాధినేత అనీ ప్రధానిని ప్రభుత్వాధినేత అనీ అంటారు. దేశ గౌరవానికి సంబంధించిన సందర్భాలలో రాష్ట్రపతిని ముందు నిలపడం ఆనవాయితీ. రాష్ట్రపతిని గౌరవించడం రాజ్యాంగాన్ని గౌరవించడమవుతుంది. ఆ మర్యాద పాటించని మోడీ ప్రభుత్వాన్ని వదిలేసి బహిష్కరిస్తున్న ప్రతిపక్షాలపై దాడి ఎక్కుపెట్టడం తలకిందులు తర్కం. ఈ విషయంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీముఖ్యమంత్రి చంద్రబాబుల వైసిపి టిడిపి పార్టీలు రెండూ మోడీకి వత్తాసునివ్వడం హాస్యాస్పదం.

ఐక్యనిరసనలో ఏపి అపశ్రుతి

20 కి పైగా ప్రతిపక్షాలు కొత్త పార్లమెంటు ప్రారంభ వేడుకను బహిష్కరించాలని నిర్ణయించడం ప్రతిపక్ష ఐక్యతకూ బిజెపి నిరంకుశ మతతత్వ రాజకీయాలపై పెరుగుతున్న వ్యతిరేకతకూ అద్దం పట్టింది. ఇటీవలే కర్ణాటక ఎన్నికలలో ఘోరపరాజయం పాలైన ఆ పార్టీ జాతీయ స్థాయిలోనూ తీవ్ర వ్యతిరేకతకు గురవుతున్నట్టు స్పష్టమైంది. అయితే మరోవైపున పార్లమెంటు భవనం అనేది రాజకీయాలకు అతీతమైన విషయమన్నట్టు దాన్ని బహిష్కరించడం అపచారమన్నట్టు ఒక పల్లవి లంకించుకున్నారు. ప్రభుత్వాధినేత అయిన ప్రధాని ప్రారంభిస్తే తప్పేమిటని కొందరు మీడియా వ్యాఖ్యాతలు కూడా వంతపాడుతున్నారు. ముందే చెప్పినట్టు రాష్ట్రపతిని దేశాధినేత అనీ ప్రధానిని ప్రభుత్వాధినేత అనీ అంటారు. దేశ గౌరవానికి సంబంధించిన సందర్భాలలో రాష్ట్రపతిని ముందు నిలపడం ఆనవాయితీ. ఎందుకంటే ఆయనను లేదా ఆమెను పార్లమెంటు ఉభయ సభలూ ఎన్నుకుంటాయి. అన్ని రాష్ట్రాల ఎంఎల్ఎలు ఓటింగులో పాల్గొంటారు. ఎన్నికైన సభ్యులందరూ పాల్గొనే ఈ ఎన్నిక దేశసమైక్యత కోణంలో కీలక పాత్ర వహిస్తుంది. కనుకనే రాష్ట్రపతిని గౌరవించడం రాజ్యాంగాన్ని గౌరవించడమవుతుంది. ఆ మర్యాద పాటించని మోడీ ప్రభుత్వాన్ని వదిలేసి బహిష్కరిస్తున్న ప్రతిపక్షాలపై దాడి ఎక్కుపెట్టడం తలకిందులు తర్కం. ఈ సమయంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్, మాజీముఖ్యమంత్రి చంద్రబాబుల వైసిపి టిడిపి పార్టీలు రెండూ మోడీకి వత్తాసునివ్వడం హాస్యాస్పదం. జాతీయ రాజకీయాలపై ఎప్పుడూ పెదవి మెదపని జగన్ ఈ విషయంలో మాత్రం తలకెత్తుకుని ఇలాటి సందర్భాన్ని రాజకీయ భేదాలకు అతీతంగా అన్ని పార్టీలూ పాలుపంచుకోవాలని ప్రతిపక్షాలకు ఉచిత సలహా ఇవ్వడం గమనించదగినది. ఇటీవలే మోడీ విజన్‌ను విధానాలను పొగిడి తరించిన చంద్రబాబు కూడా డిటోగా ప్రశంసలు కురిపించారు. ఈ విధంగా అధికారం కోసం పోటీ పడే రెండు ప్రధాన పార్టీలు బిజెపికి మద్దతు పలకడం వారి స్వామి భక్తినే చెబుతుంది. ఇక ఉత్తర ప్రదేశ్‌లో గతంలో చాలాసార్లు అవకాశవాదంగా వ్యవహరించిన బిఎస్‌పి మాయావతి, కర్ణాటకలో లోగడ జట్టుకట్టిన జెడిఎస్ దేవగౌడ కూడా కోరికోరి హాజరవుతున్నారు. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వంటివారు ఎప్పుడూ అదే మాటతో వున్నారు. ఇలాంటి వైఖరి లౌకిక విలువల కోసం జరిగే రాజ్యాంగ గౌరవం కోసం జరిగే పోరాటంలో ఒక అపశ్రుతి.

ఎక్కడిదీ రాజదండం?

మిగిలిన అనేక మతతత్వ పోకడలు నిర్ణయాలు పక్కన పెట్టి ఈ ప్రారంభోత్సవంలోనూ మోడీ ప్రభుత్వం మతరాజకీయాలనే ప్రదర్శిస్తున్నది. హిందూత్వ సిద్ధాంత కర్త గాడ్సే గురువు సావర్కర్ జయంతి నాడు ఈ ప్రారంభోత్సవం పెట్టడం వ్యూహాత్మక సంకేతమే. రాజదండం(సెంగోల్) ఉదంతం ఇందుకు మరో ఉదాహరణ. గతంలో ఎన్నడూ పెద్దగా చెప్పుకోని ఈ రాజదండం కథను తవ్వి తీయడం ద్వారా బిజెపి హిందూత్వ సిద్ధాంతానికి పెద్దపీట వేస్తున్నది.1947 ఆగష్టు 15న బ్రిటిష్ వారి నుంచి భారతీయులకు అధికార మార్పిడి జరిగేప్పుడు తమిళనాడులోని తిరువాదుతరై అధీనం అనే మఠం నుంచి ఈ రాజదండం కానుకగా సమర్పించబడింది. దాన్ని ఆ ఆశ్రమ ప్రతినిధులు ప్రధాని నెహ్రూకు అందిస్తున్న చిత్రాలు కూడా ఆనాడు వచ్చాయి. అయితే అదేదో స్వాతంత్ర సాధనకు అధికార మార్పిడికి సంకేతంగా ఇచ్చినట్టు పేర్కొనే ఆధారాలే లేవు. అలా చూసిన చెప్పిన సందర్భాలూ లేవు. హోంమంత్రి అమిత్ షా అకస్మాత్తుగా దీన్ని ప్రస్తావించినపుడు నాయకులూ పాత్రికేయులూ కూడా ఆశ్చర్యపోయారు.

అధికార మార్పిడికి ఏదైనా లాంఛనప్రాయమైన సంకేతం వుంటుందా అని మౌంట్ బాటన్‌అడిగితే నెహ్రూ మొదటి గవర్నర్ జనరల్ రాజాజీని సంప్రదించినట్టు ఆయన తమ స్వరాష్ట్రమైన మద్రాసు నుంచి దాన్ని తెప్పించినట్టు అమిత్‌షా కథచెబుతున్నారు. ఈ రాజదండాన్ని మొదట మౌంట్‌బాటన్‌కు ఇచ్చి తర్వాత నెహ్రూకు అందజేశారని కథ చెబుతున్నారు. దాన్ని పార్లమెంటు భవనంపై శాశ్వతంగా ప్రతిష్టించుతామని కూడా కేంద్రం ప్రకటించింది. బ్రిటిష్ చక్రవర్తితో సహా దేశదేశాల రాజులు పట్టాభిషేకాల సమయంలో ఈ తరహా దండం ఒకటి రాజగురువు నుంచి తీసుకునే పద్ధతి వుంది. కాని అది ప్రజాస్వామంలో ప్రజల ఆమోదం తప్ప అలాటి ఆచారాలేమీ వుండవు. పైగా లౌకిక విధానం తీసుకున్న భారతదేశంలో అసలే అవకాశం లేదు. భిన్న మతాలతో కూడిన ఈ దేశంలో ఒక మతానికి సంబంధించిన చిహ్నమే ఎలా ప్రభుత్వ చిహ్నమవుతుంది? అంటే ఇది కూడా బిజెపి మార్కు మత రాజకీయాలలోనూ తమిళనాడును సంతోషపెట్టే వ్యూహంలోనూ భాగమనుకోవాలి. కర్ణాటక దెబ్బ తర్వాత దక్షిణాదిలో పూర్తిగా ఖాళీ అయిన బిజెపి ఆ కోణంలోనూ ఈ పని చేస్తుండవచ్చు. దీనికి ఆధారాలేమంటే ఆనాడు వెలువడిన ప్రత్యేక సంచికలలో వుందంటున్నారు. తీరా చూస్తే వాటిలోనూ ఆ మఠం ప్రతినిధులు చెప్పిందే వుంది. కనక ఇది కల్పితమనేది సుస్పష్టం. రాజ్యాంగం పార్లమెంటుకు ఇచ్చిన ప్రాతినిధ్య స్వభావాన్ని, దానిలో భాగంగానూ రాజ్యాధినేతగానూ రాష్ట్రపతి స్థానాన్ని మోడీ సర్కారు అగౌరవం పాలు చేసింది. రాజ్యాంగంలో ఏ ప్రస్తాన లేని ఒక రాజదండాన్ని ఆ స్థానంలో ప్రతిష్టించడం దాని రాజరిక స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. మోడీ ఏకపక్ష నిరంకుశత్వానికి నిదర్శనమవుతుంది.

సంస్కరణలను ఆచరించి చూపిన కందుకూరి

నివాళి

వితంతువు వివాహం చేసుకోరాదనే చెడు సాంప్రదాయానికి వ్యతిరేకంగా స్త్రీల పునర్వివాహాలు చేయడానికి 1879 నుండి కంకణం కట్టుకున్న సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు.. ఎన్ని కష్టాలు, ఒడుదుడుకులు, ఛీత్కారాలు ఎదురైనా ధైర్యంగా వితంతువులకు పునర్వివాహాలు జరిపించాడు. వారి కోసం పునరావాస, శరణాలయాలు స్థాపించాడు. బాలికలకు ప్రత్యేకంగా రాజమండ్రిలో పాఠశాల స్థాపించి తెలుగునాట సంస్కరణోద్యమ 'వేగుచుక్క'గా వెలుగొందాడు.

1919 మే 27న మరణించిన కందుకూరి 104వ వర్ధంతిని పురస్కరించుకుని సంవత్సరం పొడవునా తెలుగునాట వివిధ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఆయన జీవితాన్ని, స్త్రీజనోద్ధరణకు ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. నేడు మహిళల మీద దుర్మార్గపు హింస, అత్యాచారాలు, హత్యలు పెచ్చుమీరడం చూస్తున్నాం. ఇటువంటి రోజులలో మహిళల రక్షణకు పాటుపడేవారు ఎలాంటి తెగింపుతో ముందుకు సాగాలో కందుకూరి జీవితం నేర్పుతుంది. ఒకపక్క మార్కెట్ శక్తులు మహిళలను విలాస వస్తువుగా చూపిస్తున్నాయి. మరో వైపు మార్కెట్ శక్తులకు జీ హుజూర్ అంటున్న వారు మహిళలను మూఢత్వంతో మునిగిపోమని బోధిస్తున్నారు. ప్రేరేపిస్తున్నారు. తిథులు, వారాలు, నక్షత్రాలు, జాతకాల పేరుతో తిరోగమన భావజాలం పేట్రేగిపోతోంది. ఏమిటీ దారుణం? అనుకునే వారంతా వ్యక్తులుగా, సమూహాలుగా స్త్రీల మాన, ప్రాణ రక్షణకు కృషి చేయవలసి వుంది. మహిళలను మార్కెట్ సరుకుగా మారుస్తున్న కార్పొరేట్ అరాచకానికి, స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా కూడా జమిలి పోరాటం సాగాలి. అందుకు నేటికీ ప్రేరణ కలిగించేదిగా మనకు కందుకూరి వీరేశలింగం జీవితం స్ఫూర్తినిస్తుంది. రచనల ద్వారా తెలుగు భాష అభివృద్ధికి పాటుపడటం, మహిళా విద్య కోసం పాటుపడిన తీరు, వితంతు వివాహాల కోసం చేసిన ప్రయత్నాలు, అవినీతికి వ్యతిరేకంగా పత్రిక ద్వారా చేసిన ప్రయత్నం, ప్రేరణ కలిగిస్తూనే వుంటాయి.

జీవిత సంగ్రహం...

పసి బాలికలకు ముసలి వారితో వివాహాలు చేసే రోజులవి. భర్త చనిపోతే వితంతువులు మరలా పెళ్లి చేసుకోరాదనే మూఢాచారం అమలులో వున్న సాంఘిక పరిస్థితులలో కందుకూరి వీరేశలింగం 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. చిన్నప్పటి నుంచీ 'ఏక సంధాగ్రాహి'గా వుండేవాడు. బడిలో పాఠాలు ఒక్కసారి చదివితే కంఠతా వచ్చేసేవి. ఇంటిలో అటక మీద వున్న తాటాకు పుస్తకాలు తీసి చదివేవాడు. దాంతో తెలుగు మీద అభిమానం పెరిగింది.

బడిలో చదువు, సత్ప్రవర్తనలో వీరేశలింగందే అగ్రస్థానం. అనేకసార్లు అధికారులు, పెద్దల నుండి బహుమతులు పొందాడు. మూడో ఫారం చదువు తుండగానే జబ్బు చేసింది. తిరిగి 5వ ఫారంలో అనారోగ్యం. కుటుంబ ఇబ్బందులతో కూడా హైస్కూలు విద్య పూర్తి చేసి కళాశాల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల పేరుతో చదువు మధ్యలో ఆపేయలేదు. తల్లిదండ్రులు వీరేశలింగం చదువును తాము ఎన్ని ఇబ్బందులతో వున్నా మాన్పించలేదు.

వీరేశలింగం వర్ధంతి సందర్భంగా...

వీరేశలింగానికి జబ్బు చేస్తే ఎవరో తన కుమారుడికి చేతబడి చేశారని భూతవైద్యుని పిలిపించి వైద్యం చేయించడానికి ప్రయత్నించింది ఆయన తల్లి. ఆ భూత వైద్యుడిని వీరేశలింగం వివిధ ప్రశ్నలు వేయడంతో భయపడి పారి పోయాడు. ఇంటికి వెళ్లాక అనారోగ్యం పాలయ్యాడు. పైగా వీరేశలింగం తనకే చేతబడి చేశాడని భయపడిపోయాడు. దీంతో వీరేశలింగం అతని ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పి అతని ఆరోగ్యం కుదుటపర్చాడు. దెయ్యాలు, భూతాలు లేవంటూ వాదించేవాడు. తోటి వారితో సవాలు చేసి అర్ధరాత్రి, అమావాస్యనాడు శ్మశానానికి వెళ్లి తెల్లవారి మామూలుగానే వచ్చి ఒక్క దెయ్యం కూడా కనపడలేదని దెయ్యాల పేరుతో భయాలు అనవసరం అని ఆనాడే చాటి చెప్పాడు.

వీరేశలింగానిదీ బాల్య వివాహమే

వీరేశలింగానికి 13వ ఏట పట్టాభిరామయ్య ఏడేళ్ల కుమార్తె బావమ్మ లక్ష్మీరాజ్యంతో వివాహం జరిగింది.



వారిద్దరూ తెలుగు నాట సంస్కరణోద్య మాలకు తోడ్పడ్డారు. వీరేశలింగం రాజమండ్రిలో ఒక సంవత్సరం పాటు ఉపాధ్యాయుడిగా పని చేశాడు. 1872వ సంవత్సరంలో కోరంగిలో ఇంగ్లీషు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగం లభించింది. అప్పటికే ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చింది. మూఢ నమ్మకాలు, ఆచారాలు మీద నమ్మకాలు మారిపోయాయి. కోరంగి స్కూలులో చేరటానికి అమావాస్యనాడు వెళ్లే ముహూర్తం నిర్ణయించుకున్నాడు. ఆ విధంగా భూమి, సూర్యుడు చుట్టు తిరగడం వల్ల ఏర్పడే సంవత్సరం లోని రోజులలో మంచి రోజులు, చెడు రోజులు అనే తేడాలు చూడడం మూఢత్వంగా చాటి చెప్పాడు.

వితంతువు వివాహం చేసుకోరాదనే చెడు సాంప్రదాయానికి వ్యతిరేకంగా స్త్రీల పునర్వివాహాలు చేయడానికి 1879 నుండి కంకణం కట్టుకున్నాడు. అనేక కష్టాలు, వ్యతిరేకతలు, ఛీత్కారాలు ఎదురైనా ధైర్యంగా వితంతువులకు పునర్వివాహాలు జరిపించాడు.

1886లో రాజమండ్రి పురపాలక సంఘ సభ్యుడుగా, తరువాత పురపాలక సంఘ అధ్యక్షుడిగా పని చేశాడు. వితంతువుల పునరావాస, శరణాలయాలు స్థాపించాడు. బాలికలకు ప్రత్యేకంగా రాజమండ్రిలో పాఠశాల స్థాపించి తెలుగునాట సంస్కరణోద్యమ 'వేగుచుక్క'గా వెలుగొందాడు.

సంఘసంస్కరణలు–వితంతు వివాహాలు

మత సాంప్రదాయ కుటుంబానికి చెందిన వీరేశలింగం విద్యార్థి దశ లోనే ముఖానికి విభూది రేఖలు, మెడలో లింగకాయ తీసి వేశాడు. ఆ రకంగా మత చిహ్నాలను తొలగించుకోవడం ద్వారా ప్రారంభమైన సంస్కరణ కార్యక్రమం జీవితాంతం కొనసాగింది. 1874లో మిత్రులతో కలిసి సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రచారం చేసేందుకు 'వివేకవర్ధని' పత్రికను స్థాపించి తెలుగు ప్రజా సమాజంలో వున్న అవలక్షణాలను, అధికారుల లంచగొండితనాన్ని, మూఢాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. రాజమండ్రిలో ఒక ప్రభుత్వ న్యాయవాది, జిల్లా మున్సిఫ్ మేజిస్ట్రేటు కలసి కోర్టును లంచాలశాలగా మార్చగా దానిపై తన పత్రికలో రాసి విచారణ జరిగేలా చేసి వారిని ఉద్యోగాల నుంచి తొలగించేలా చేశాడు. ఇతర అధికారుల లంచగొండితనానికి వ్యతిరేకంగా వార్తలు రాసి అనేకమంది వ్యతిరేకతను సైతం ధైర్యంగా ఎదుర్కొన్నాడు.

చిన్నప్పుడే పెళ్లయిన స్త్రీలు, భర్త చనిపోతే జీవితాంతం వితంతువుగానే పడి ఉండాల్సిందేననే దురాచారం అమలులో వుండేది. దీనిపై చలించిన వీరేశలింగం తన మిత్రులతో కలసి స్త్రీల పునర్వివాహాలను గూర్చి బహిరంగ సభల ద్వారా ప్రచారం చేశాడు. కేవలం ప్రచారం తోనే కృషిని పరిమితం చేయకుండా కార్యాచరణకు పూనుకున్నాడు. రాజమండ్రిలో మిత్రులతో కలసి 1878 సెప్టెంబరు 8న 'సంఘ సంస్కరణ' సమాజం స్థాపించాడు.

మూఢాచారాలకు వ్యతిరేకంగా కృషి

వీరేశలింగం స్త్రీ పునిర్వవాహం కోసం జరిపిన కృషి, ప్రచారాలను మొదటి నుండి అనేక మంది వ్యతిరేకించారు. కొన్ని సందర్భాలలో మూర్ఖులు, వీరేశలింగంపై ప్రత్యక్ష దాడులకు సిద్ధపడిన సంఘ టనలూ వున్నాయి. అనేక కష్టాలు, వ్యతిరేకతలు, ఛీత్కారాలు ఎదురయ్యాయి. అభ్యుదయ వాదులైన కొందరు విద్యార్థులు, యువకులు మాత్రం ఆయనకు తోడ్పడేవారు. ఒకసారి రాజమండ్రిలో వితంతువుల పునర్వివాహాలు శాస్త్ర విరుద్ధం కాదని ఉపన్యాసం ఇస్తుండగా కొందరు మూర్ఖులు దాడి చేయబోయారు. విద్యార్థులు వీరేశలింగాన్ని రక్షించారు. కాకినాడలో కూడా దాడి జరుగగా ఆనందాచార్యులనే సంస్కరణాభిలాషి తన బండిలో ఎక్కించుకొని కాపాడారు. వితంతు పునర్వివాహాలు గురించి ప్రజలలో బాగా స్పందన వచ్చింది. వధూవరుల కోసం రాత్రిళు ప్రయాణాలు చేయడం, ఆడపిల్లలకు మగవేషాలు వేయడం, వాళ్లను ఎత్తుకొని మైళ్ల కొద్దీ నడవడం వంటి కష్టాలు పడ్డాడు. వీరేశలింగం తన ఇంటికి చేరిన వితంతువులను కాపాడి వివాహాలు చేశాడు. బంధువులు, మిత్రులు, ఆప్తులు వ్యతిరేకించినా ఇబ్బందులొచ్చినా ఏనాడూ ఒక్కడుగు వెనక్కి వేయలేదు.

వీరేశలింగం చేసిన మొదటి వితంతు పునర్వివాహం కృష్ణా జిల్లా రూపూడి గ్రామానికి చెందిన పన్నెండేళ్ల గౌరమ్మకు 22 ఏళ్ల గోగులపాటి శ్రీరాములుకు 1881 డిసెంబరు 11న రాజమండ్రిలో జరిపించాడు. వీరేశలింగానికి మొదట్లో సహాయకులుగా వున్నవారు కొందరు తరువాత దూరమయ్యారు. అయినా కార్యదీక్షతో కొద్ది సంవత్సరాల కాలంలోనే 112 వితంతు వివాహాలు జరిపించాడు. దీంతో దేశ నలుమూలల నుంచి ప్రశంసలు పొందాడు.

మహిళా విద్య కోసం కృషి

ఈ విధంగా స్త్రీ పునర్వివాహాల గురించి ఉద్యమం నిర్వహిస్తూనే స్త్రీ విద్య కోసం బాలికల పాఠశాల నిర్మించడం, రాత్రి పాఠశాలలు నిర్వహించడం వంటివి చేశాడు. ఆయన జీవితాంతం స్త్రీల అభ్యున్నతి కోసం పాటుపడ్డాడు.

మెడలో జంధ్యాన్ని పీకి పారేసిన, అమావాస్యనాడు ఉద్యోగంలో చేరాడు, అగ్ర వర్ణాలకు మాత్రమే చదువు పరిమితంగా చెప్పే పంతుళ్ల స్థానంలో అందరికీ అందులోనూ ఆడపిల్లల కోసం స్కూలు ఏర్పాటు చేశాడు.

నేడు సమాజంలో పెరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వరకట్న హత్యలు వంటి సామాజిక రుగ్మతలపై కందుకూరిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు, యువత, అభ్యుదయవాదులు కలసి కట్టుగా పోరాడాల్సిన అవసరముంది. ఇదే ఆ మహనీయునికి మనం అర్పించే నిజమైన నివాళి.

– గుడిపాటి నరసింహారావు (వ్యాసకర్త)

నేడు కొత్త పార్లమెంట్ ఎదుట మహిళా మహాపంచాయత్

● రెజ్లర్ల పోరుకు రామ్‌దేవ్‌బాబా, టోక్యో విజేత మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కొత్త పార్లమెంటు ఎదుట దేశ మహిళా క్రీడాకారులు ఆదివారం తలపెట్టిన మహాపంచాయత్‌కు సన్నాహాలు పూర్తయ్యాయి. దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్ల మహిళా సమ్మాన్ మహాపంచాయత్ పిలుపు నేపథ్యంలో కేంద్రం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఢిల్లీ సరిహద్దుల్లో, ఢిల్లీ లోపల భారీస్థాయిలో బారికేడ్ల ఏర్పాటు చేశారు. ఏ ఒక్కరినీ పోలీసులు అనుమతించటం లేదు. 11:30 గంటలకు పార్లమెంటు ముందు ప్రతిపాదించిన మహిళా సమ్మాన్ మహాపంచాయత్ కోసం మార్చ్ శాంతియుతంగా ప్రారంభమవుతుందని రెజ్లర్లు తెలిపారు. ఇది పార్లమెంటు వద్దకు చేరిన తరువాత సమావేశం అవుతుంది. మహాపంచాయత్‌కు అనుమతి ఇవ్వలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. మనమందరం మహాపంచాయత్‌ని శాంతియుతం గా నిర్వహించాలని క్రీడాకారులు తెలిపారు. పార్లమెంట్ ప్రారంభోత్సవానికి బ్రిజ్ భూషణ్ హాజరైతే.. దేశంలో నెలకొన్న పరిస్థితుల గురించి స్పష్టమైన సందేశం ప్రజలకు వెళ్తుందని రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అన్నారు. 'ఆయనకు ఎవరు మద్దతు పలికినా వారు మాకు వ్యతిరేకమే. ప్రభుత్వంలో అంతర్గతంగా ఏం జరుగుతుందో మాకు తెలియదు కానీ.. కొంతమంది ఆయనను రక్షించడానికి ప్రయత్నిస్తున్నారు. అది సరికాదు. ఆయన దేశంలోని ఆడబిడ్డలకు హాని చేస్తున్నారు' అని అన్నారు.

అంతర్జాతీయ సంఘీభావం

బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన శనివారం 35వ రోజు కొనసాగింది. టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ జపాన్‌కు చెందిన రిసాకో కవాయ్ భారతీయ రెజ్లర్లకు మద్దతు ప్రకటించారు.

రామ్‌దేవ్‌బాబా మద్దతు

రెజ్లర్లకు రామ్‌దేవ్‌బాబా మద్దతు ప్రకటించారు. రెజ్లర్లు ఆందోళన చేసే పరిస్థితి రావడం సిగ్గుచేటని, వేధింపులకు పాల్పడే వ్యక్తుల్ని వెంటనే అరెస్టు చేసి.. జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఆ వ్యక్తి మహిళల గురించి చెత్తగా మాట్లాడుతున్నాడని, అయన తీరు ఖండించదగినదని అన్నారు.

ఢిల్లీ కోర్టుకు స్టేటస్ రిపోర్టు అందజేసిన పోలీసులు

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు సంబంధిం చి మహిళా రెజ్లర్లు దాఖలు చేసిన దరఖాస్తుపై ఢిల్లీ పోలీసులు శనివారం స్టేటస్ నివేదికను దాఖలు చేశారు. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసిన దాదాపు రెండు వారాల తరువాత ఇది జరిగింది. సెక్షన్ 164 కింద బాధితుల వాంగ్మూలాలను కూడా నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ కేసు తదుపరి విచారణను జూన్ 27న వాయిదా వేసింది.

సిద్ధూ కేబినెట్‌లో మరో 24 మంది మంత్రులు

● కీలక శాఖలు సిఎం వద్దే ● పరమేశ్వరకు హోం

బెంగళూరు : కర్ణాటక కేబినెట్‌లో శనివారం మరో 24 మంది మంత్రులుగా చేరారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తో చర్చలు జరిపిన అనంతరం నూతన మంత్రుల పేర్లను కాంగ్రెస్ నాయకత్వం ప్రకటించింది. తాజా విస్తరణతో కర్ణాటక కేబినెట్‌లో మొత్తం మంత్రుల సంఖ్య 34కు చేరింది. నూతన మంత్రులకు శాఖలు కూడా కేటాయించారు. కేబినెట్ కూర్పుపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి విడివిడిగా పార్టీ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. వారు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, రణదీప్ సుర్జేవాలాతో కూడా సమాలోచనలు జరిపారు. సిద్ధరామయ్య కీలకమైన ఆర్థిక, కేబినెట్ వ్యవహారాలు, సిబ్బంది-పాలనా సంస్కరణలు, ఇంటెలిజెన్స్, సమాచార శాఖలను తన వద్దే ఉంచుకున్నారు. శివకుమార్‌కు నీటిపారుదల, బెంగళూరు అభివృద్ధి శాఖలు కేటాయించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జి.పరమేశ్వరకు హోం శాఖ, మల్లిఖార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు ఇచ్చారు. నూతన మంత్రులలో ఎక్కువమంది శివకుమార్ సన్నిహితులేనని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అన్ని సామాజిక వర్గాలకూ కేబినెట్‌లో స్థానం లభించిందని ఆ వర్గాలు వివరించాయి. రాష్ట్ర కేబినెట్‌లో ఎనిమిది మంది లింగాయతులు, ఏడుగురు ఎస్సీలు, ఐదుగురు ఒక్కలిగులు, ఇద్దరు ముస్లిములు, ముగ్గురు ఎస్టీలు, ఆరుగురు ఓబీసీలు ఉన్నారు. నూతన మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో హెచ్‌కే పాటిల్, కృష్ణ బైరెగౌడ, ఎన్ చెలువరాయస్వామి, కే వెంకటేష్, హెచ్‌సీ మహదేవప్ప, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ ఈశ్వర్ ఖండ్రే, పిసిసి మాజీ అధ్యక్షుడు దినేష్ గుండూరావు ఉన్నారు. ఉదయం 11.45 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కొత్త మంత్రుల బంధువులు, శ్రేయోభిలాషులు, మద్దతుదారులు హాజరయ్యారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎఐసిసి కార్యదర్శి ఎన్‌ఎస్ బోసేరాజు త్వరలో శాసన మండలికి ఎన్నికవుతారని భావిస్తున్నారు. ఈ నెల 20న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, మరో ఎనిమిదిమంది మంత్రులు ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

జాతీయ భద్రతపై మోడీ ప్రభుత్వం రాజీ : కాంగ్రెస్

గౌహతి : జాతీయ భద్రతపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజీ పడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజయ్ మాకెన్ విమర్శించారు. ఎన్నికల ప్రయోజనాల కోసం విద్వేష రాజకీయాలను మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తుందని, రాజ్యాంగ విలువలను - ప్రజాస్వామ్య సంస్థలను బలహీనం చేస్తుందని ఆయన అన్నారు. తొమ్మిదేళ్లు పూర్తయిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తిచూపేందుకు 35 నగరాల్లో 'తొమ్మిదేళ్లు తొమ్మిది ప్రశ్నలు' పేరుతో విలేకరుల సమావేశాలు నిర్వహిస్తామని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గౌహతిలో అజయ్ మాకెన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించకూడదని బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మాకెన్ విమర్శించారు. ఆర్థిక అసమానతలు భారీగా పెరుగుతున్నప్పటికీ దేశ ఆస్తులను మోడీ తన స్నేహితులకు విక్రయిస్తున్నారని చెప్పారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని, ప్రతిపక్ష పార్టీలపై ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

నాటో కూటమిలోకి భారత్!

● చైనాపై ఏర్పాటైన అమెరికన్ హౌస్ కమిటీ సిఫారసు ● త్వరలో మోడీ అమెరికా పర్యటన



వాషింగ్టన్: అమెరికా తన ప్రపంచాధిపత్యాన్ని కొనసాగించే వ్యూహంలో భాగంగా భారత్‌ను నాటో కూటమిలోకి లాగేందుకు రంగం సిద్ధం చేసింది. చైనా ప్రాబల్యాన్ని అరికట్టి, దానిని దెబ్బతీయడమే లక్ష్యంగా నాటో ప్లస్ 5 గ్రూపులోకి భారత్ ను చేర్చుకోవాలని అమెరికన్ కాంగ్రెస్ హౌస్ సెలక్టు కమిటీ సిఫారసు చేసింది. అమెరికన్ కాంగ్రెస్ స్పీకర్ మెక్ కార్థీ గత జనవరిలో ఏర్పాటు చేసిన ఈ కమిటీ తన తొలి నివేదికను శుక్రవారం నాడిక్కడ విడుదల జేసింది. అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహంలో ప్రధాన సాధనంగా ఉన్న నాటో కూటమిలో ఉత్తర అట్లాంటిక్ ప్రాంత దేశాలతోబాటు తూర్పు యూరపు దేశాలు కలిపి మొత్తం 31 సభ్య దేశాలు ఉన్నాయి. దీనికి అనుబంధంగా (నాటో ప్లస్) పేరుతో మరో అయిదు దేశాలను చేర్చుకుంది. . అవి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, ఇజ్రాయిల్, ద.కొరియా. ఇప్పుడు వీటికి భారత్ అదనంగా తోడవుతుందన్నమాట. ప్రపంచ నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదిగే క్రమంలో ఉన్న చైనాను, దానికి నాయకత్వం వహిస్తున్న చైనా కమ్యూనిస్టు పార్టీని దెబ్బ తీయడమే లక్ష్యంగా అమెరికా రకరకాల పన్నాగాలు పన్నుతున్నది. ఇప్పటికే రష్యాను బలహీనపరిచేందుకు ఉక్రెయిన్ యుద్ధాన్ని 15 నెలలుగా రాజేస్తున్నది. తన ఆధిపత్యానికి గట్టి సవాల్ విసురుతున్న రష్యా, చైనాలపైనే అమెరికా గురి పెట్టింది. ఇందుకనుగుణంగా జనాభాపరంగా ప్రపంచంలోనే అతి పెద్ద దేశమైన భారత్‌ను తన విష కౌగిలిలో బిగించేందుకు ప్రయత్నిస్తున్నది. భారత్‌లోని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అమెరికా అడుగులకు మడుగులొత్తుతూ దానికి జూనియర్ భాగస్వామిగా వ్యవహరిస్తున్నది. ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటనకు వెళ్లడానికి ముందే అమెరికన్ కాంగ్రెస్ హౌస్ సెలక్టు కమిటీ ఈ నివేదికను విడుదల చేయడం గమనార్హం. ఇప్పటికే ఇండో పసిఫిక్ సెంట్రిక్ గ్రూపు, క్వాడ్, ఇతర పొత్తులు, భాగస్వామ్యాల పేరుతో భారత్‌ను తన భద్రతా చట్రంలో ఇరికిస్తున్న అమెరికా ఇప్పుడు నాటో ప్లస్‌లో చోటు కల్పించడం ద్వారా చైనా చుట్టూ తన సైనిక ఉచ్చు బిగించాలని చూస్తోంది, చైనాలో అంతర్భాగమైన తైవాన్‌లో వేర్పాటువాదులను ప్రోత్సహిస్తున్నది. చైనా నుంచి తైవాన్‌ను వేరు చేయడానికి అవసరమైతే తన రక్షణ బలగాలను ఈ ద్వీప ప్రాంతానికి పంపుతామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ మధ్య పదే పదే ప్రకటిస్తున్నారు. జి-7, నాటో, క్వాడ్ అన్నీ కలిస్తే అత్యంత ప్రభావం చూపుతాయని, ఈ విషయాన్ని బహిరంగంగా ప్రచారం చేయడం ద్వారా చైనాను హెచ్చరించడమే కాదు, ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రభావానికి అడ్డుకట్ట వేయొచ్చని హౌస్ కమిటీ పేర్కొంది. అంతేకాదు, రష్యా, చైనాలకు వ్యతిరేకంగా విధించే ఆంక్షలు మెరుగ్గా పనిచేయడానికి భారత్‌ను నాటోలో చేర్చడం అవసరమని ఆ కమిటీ పేర్కొంది. కొన్నాళ్ల క్రితం భారత్‌ను నాటో ప్లస్ గ్రూపులోకి చేర్చుకోవాలంటూ ఒక బిల్లును అమెరికన్ కాంగ్రెస్‌కు చెందిన డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు రో ఖన్నా ఓ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ పరిస్థితుల్లో భారత ప్రధాని మోడీ వచ్చే నెల 21 నుంచి నాలుగు రోజులపాటు అమెరికాలో జరపతలపెట్టిన పర్యటన ఈ ఎజెండా కోసమేనా?

సమ్మె హక్కు ప్రజాస్వామ్యబద్ధం

● తీర్మానం ఆమోదించిన యూరోపియన్ టియుసి



బెర్లిన్ : కార్మికులకు ఉన్న సమ్మె హక్కుపై ప్రభుత్వాల దాడులను యూరోపియన్ ట్రేడ్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. సమ్మె హక్కుపై అత్యవసర తీర్మానాన్ని యూరోపియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫడరేషన్ (టియుసి) కాంగ్రెస్ ఆమోదించింది. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో జరిగిన సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. 'సమ్మె చేసే హక్కు ప్రజాస్వామ్యబద్ధమైన హక్కు. సంఘటితంగా డిమాండ్ల కోసం చేసే పోరాటంలో అంతర్భాగం' అని తీర్మానం పేర్కొంది. సమ్మె హక్కుపై ఇంగ్లండ్‌లో కఠినమైన చట్టం చేసిన నేపథ్యంలో టియుసి ఈ తీర్మానం చేసింది. సమ్మె హక్కుపై దాడులు బ్రిటన్‌కు మాత్రమే పరిమితం కాలేదని విమర్శించింది. ఈ సందర్భంగా టియుసి సహాయ ప్రధాన కార్యదర్శి కేట్ బెల్ మాట్లాడుతూ 'యూరోపియన్ యూనియన్ నుంచి ఇంగ్లండ్ వైదొలిగి ఉండవచ్చు. కానీ యూరప్ అంతటా ఉన్న కార్మికులను అనుసంధానించే సంఘీభావ బంధాలు ఎప్పటికీ విచ్ఛిన్నం కావు' అని చెప్పారు. బెల్జియంలో కూడా సమ్మె చేస్తున్న కార్మికులకు వ్యతిరేకంగా కోర్టు తీర్పులు వచ్చాయని యూరోపియన్ యూనియన్ గుర్తు చేసింది. ప్రజాస్వామ్య హక్కులను, స్వేచ్ఛను యూనియన్లు దృఢంగా రక్షించుకోవాలని పిలుపునిచ్చింది.

'సారే జహాసె అచ్ఛా' రచయిత ఇక్బాల్ పాఠం తొలగింపు

● ప్రత్యేక అధ్యయనంగా హిందూత్వ : ఢిల్లీ వర్శిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'సారే జహ సే అచ్ఛా' గీత రచయిత మహమ్మద్ అల్లమ ఇక్బాల్‌పై పాఠాన్ని సిలబస్ నుంచి తొలగించాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. బిఎ ఆరో సెమిస్టర్‌లో 'మోడరన్ ఇండియన్ పొలిటికల్ థాట్' అధ్యాయంలో ఆయన గురించి ఉన్న పాఠాన్ని తొలగించాలని విశ్వ విద్యాలయం అకడమిక్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఢిల్లీ యూనివర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ యోగేశ్ సింగ్ మాట్లాడుతూ దేశ విభజనకు పునాది వేసినవారి గురించి సిలబస్‌లో ఉండకూడదన్నారు. 1,014వ అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి, ఇక్బాల్‌పై అధ్యాయాన్ని తొలగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అకడమిక్ కౌన్సిల్ మెంబర్ ఒకరు వార్తా సంస్థతో మాట్లాడుతూ దేశ విభజన, హిందూత్వం, గిరిజనులపై అధ్యయనాలకు ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను కూడా ఆమోదించినట్లు తెలిపారు.

వేతనాలు పెంచండి.. ఉక్రెయిన్‌కు ఆయుధాలివ్వొద్దు

ఇటలీ, స్పెయిన్‌లో కార్మికుల సమ్మె సక్సెస్



రోమ్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

రోమ్ : వేతనాలు పెంచాలని, ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఇటలీ, స్పెయిన్‌ల్లో శుక్రవారం భారీ ఎత్తున సమ్మె జరిగింది. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన కోసం కార్మికులు డిమాండ్ చేశారు. నెలకు 300 యూరోల వేతనాన్ని పెంచాలని, గంటకు కనీసం 10 యూరోల వేతనం ఇవ్వాలని నినదించారు. 'బతకడానికి పని చేయండి, పని చేయడానికి జీవించడం కాదు' అని కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఇటలీ రాజధాని రోమ్‌తోపాటు, ఇతర నగరాల్లోనూ కార్మికులు భారీఎత్తున ర్యాలీలు నిర్వహించారు. వేలాది మంది ఈ ర్యాలీల్లో పాల్గొన్నారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, అధిక ద్రవ్యోల్బణం, తక్కువ వేతనాలు వంటి సమస్యలకు ప్రభుత్వం అనుసరిస్తున్న 'యుద్ధపూరిత విధానాలు' కారణమని నిరసనకారులు విమర్శించారు. ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్పెయిన్‌లోనూ పెద్దఎత్తున ర్యాలీలు జరిగాయి. వేతనాలు పెంచాలని, 'ఆరోగ్యం-విద్యను ప్రైవేటీకరించవద్దు' అని, 'ఆరోగ్యం, విద్యా రంగాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని' నినాదాలతో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో వేలాది మంది ర్యాలీ నిర్వహించారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఇంధన, ఆహార ధరలు పెరిగిపోయాయని ఆందోళనకారులు విమర్శించారు.

సిఐటియు అభినందనలు

ఇటలీలో సమ్మె విజయవంతం చేసినందుకు సిఐటియు ఆ దేశ కార్మిక లోకానికి సిఐటియు అభినందనలు తెలిపింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. యూనియన్ సిండకేల్ డి బేస్ (యుఎస్‌బి) బ్యానర్ కింద జరిగిన ఈ సమ్మె విజయవంతం కావడం శ్రామికవర్గానికి వ్యతిరేకంగా ఇటలీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఉన్న ఆగ్రహానికి నిదర్శనమని తెలిపింది. కార్మికుల జీవితాలు, జీవనోపాధిపై హద్దులేని దాడులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా ఈ నెల 26న సమ్మె జరిగిందని సిఐటియు తెలిపింది. ఇటలీలో ప్రధానమంత్రి జార్జియా మెలోని నేతృత్వంలో నయా ఫాసిస్ట్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేతనాలు తగ్గించడం వంటి చర్యల ద్వారా కార్మికులపై దాడులు ప్రారంభమయ్యాయని, అదే సమయంలో కార్పొరేట్, పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూల విధానాలు అమలవుతున్నాయని సిఐటియు విమర్శించింది. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ఇటలీ ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు కోరింది.

పాక్‌లో భద్రతా కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి

● 19 మంది సిబ్బందికి తీవ్ర గాయాలు

ఇస్లామాబాద్ : ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో ఉన్న వాయువ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పక్తున్‌ఖ్వా రాష్ట్రంలో భద్రతా సిబ్బంది కాన్వాయ్‌పై ఆత్మాహుతి బాంబర్ దాడి చేయడంతో 19 మంది సిబ్బంది గాయపడ్డారు. ఖైబర్ పక్తున్‌ఖ్వా రాష్ట్రంలోని డిఐ ఖాన్ నుంచి దక్షిణ వజీరిస్థాన్ రాష్ట్రంలోని అస్మాన్ మాంజా ప్రాంతానికి భద్రతా కాన్వాయ్ వెళుతుండగా శనివారం ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నిండిన మోటార్ సైకిల్‌తో ఆత్మాహుతి బాంబర్ ఈ దాడికి పాల్పడ్డాడు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ దాడికి బాధ్యులమని ఇప్పటి వరకూ ఏ తీవ్రవాద సంస్థ ప్రకటించలేదు. పాకిస్థాన్‌లో ఇటీవల ఆత్మాహుతి దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇదే రాష్ట్రంలో బుధవారం జరిగిన దాడిలో నలుగురు మరణించారు. జనవరి 30న పెషావర్‌లో ఒక మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడిలో 101 మంది మరణించగా, 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.

అగ్రరాజ్యాల పోటీలో దక్షిణాఫ్రికా ఉండదు : అధ్యక్షులు రమాఫోస

జోహన్నెస్‌బర్గ్ : ప్రపంచంలో అగ్రరాజ్యాల మధ్య పోటీలో దక్షిణాఫ్రికా ఉండదని ఆ దేశ అధ్యక్షులు సిరిల్ రమాఫోసా అన్నారు. ఆఫ్రికా దినోత్సవం సందర్భంగా జోహన్నెస్‌బర్గ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రమాఫోసా మాట్లాడుతూ ఆఫ్రికా ఖండం తరచుగా తమది కాని వివాదాల్లోకి లాగబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికా తన స్వతంత్ర, అలీన విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

నెలాఖరు వరకు అవినాష్‌రెడ్డిపై చర్యలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

కచ్చితంగా కుట్రేనని సిబిఐ పేర్కొంది. వివేకా హత్యకు అనేక ఉద్దేశాలు చెబుతున్నారని, ప్రధాన కారణం ఏంటని సిబిఐని హైకోర్టు ప్రశ్నించింది. వివేకా హత్యకు నెల రోజుల ముందే కుట్ర జరిగిందని, వివేకా హత్య రాజకీయ కారణాలతోనే జరిగిందని సిబిఐ పేర్కొంది. అవినాష్ కుటుంబానికి వివేకాతో రాజకీయ విభేదాలున్నాయని, ఎంఎల్‌సి ఎన్నికల్లో వివేకా ఓటమి వెనక కుట్ర జరిగిందని తెలిపింది. ఎంపి అవినాష్‌రెడ్డి రాజకీయంగా శక్తిమంతుడైతే, వివేకాను చంపాల్సిన అవసరమేంటని సిబిఐని హైకోర్టు ప్రశ్నించింది.

శివశంకర్‌రెడ్డి, గంగిరెడ్డి ద్వారా అవినాష్‌రెడ్డి కుట్రను అమలు చేశారని కోర్టుకు సిబిఐ తెలిపింది. హత్య జరిగిన రోజు అర్ధరాత్రి అవినాష్‌రెడ్డి వాట్సప్ కాల్స్ మాట్లాడారని, ఎవరితో మాట్లాడారో తెలియాల్సి ఉందని పేర్కొంది. అవినాష్ ఫోన్ ఎందుకు సీజ్ చేయలేదని సిబిఐని కోర్టు ప్రశ్నించింది. ఈ నెల 12న అవినాష్ ఫోన్ ఇంటర్ నెట్ ప్రోటోకాల్ డిటైల్ రికార్డ్ డేటా సేకరించామని, అవినాష్‌రెడ్డి సాక్ష్యాలను ప్రభావితం చేస్తున్నారని, కీలక సాక్షుల వాంగ్మూలాలు సీల్డ్ కవర్‌లో అందజేస్తామని కోర్టుకు సిబిఐ తెలిపింది. ప్రస్తుత దశలో సాక్ష్యాల వివరాలు వెల్లడించలేమని పేర్కొంది. అవినాష్ తరుపు న్యాయవాది ఉమామహేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, అవినాష్ తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన అవసరం ఆమెకు ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాంగ్మూలాలపై అవినాష్ వాదనలు వినాల్సిఉందని న్యాయమూర్తి అన్నారు. ఈ నెల 31 వరకు అవినాష్‌పై చర్యలు తీసుకోవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

రానున్నది క్యాష్ వార్

(మొదటి పేజీ తరువాయి)

వేయలేదని, ప్రాజెక్టు కట్టలేదని, ప్రభుత్వ ఉగ్రవాదంతో ఒక్క పెట్టుబడి కూడా రాలేదని అన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన జగన్... కేంద్రం ముందు మెడలు దించి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. ప్రతి స్కీములోనూ స్కాం ఉంటుందని, లేచిన నుంచి అన్నీ అబద్ధాలే చెబుతారని ఆరోపించారు. ఎక్కడో ఉండే అమూల్‌ను రాష్ట్రానికి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడికత్తి డ్రామా చూశామని, ఇప్పుడు వివేకా హత్య కేసులో అన్ని విషయాలూ తేలాలని అన్నారు. టిడిపి జెండా తెలుగు జాతికి అండ అని, టిడిపి గుర్తు సైకిల్ చక్రాలు అభివృద్ధి, సంక్షేమం అని పేర్కొన్నారు. జనాభా దామాషా లెక్కన అన్ని తరగతులకూ న్యాయం చేస్తానని అగ్రవర్ణ పేదల సంక్షేమంపై తీర్మానంపై చర్చలో చంద్రబాబు హామీ ఇచ్చారు.

కేరళ రబ్బరు రైతుల రాజ్‌భవన్ మార్చ్

● రైతు వ్యతిరేక రబ్బరు బిల్లును ఉపసంహరించాలి: వక్తల డిమాండ్

తిరువనంతపురం : కేరళలోని తిరువనంతపురంలో రబ్బరు రైతులు కదం తొక్కారు. పది వేల మందికిపైగా రైతులు ఎఐకెఎస్ అనుబంధ కేరళ కర్షక సంఘం ఆధ్వర్యాన కేరళ యూనివర్శిటీ సమీపంలోని అసన్ స్క్వేర్ నుంచి రాజ్‌భవన్ వరకూ శుక్రవారం మార్చ్ నిర్వహించారు. రాజ్‌భవన్ బయట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎఐకెఎస్ అధ్యక్షులు డాక్టర్ అశోక్ ధావలే, ఉపాధ్యక్షులు ఇపి జయరాజన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్, రిసెప్షన్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వి జాయ్, ఎఐకెఎస్ రాష్ట్ర కార్యదర్శి వాల్సన్ పనోలి తదితరులు ప్రసంగించారు. ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల రబ్బరు, ఇతర వాణిజ్య పంటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆసియన్ దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల రబ్బరు, ఇతర వాణిజ్య పంటల రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని చెప్పారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక రబ్బరు బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంటగా రబ్బరు గుర్తించాలని, కిలోకు రూ.300 కనీస ధరగా నిర్ణయించాలని కోరారు. పన్నులు లేని రబ్బరు దిగుబమతులను నిలిపివేయాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని, రబ్బరు వ్యవసాయా నికి సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యతిరేకం గా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్న భారీ టైర్ తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

నీతి ఆయోగ్‌లో నీతులు

(మొదటి పేజీ తరువాయి)

జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారిని రాష్ట్ర సగటుతో సమానంగా తీసుకురావడం ఎబిపి లక్ష్యమని చెప్పారు. అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంలో భాగంగా మిల్లెట్ కార్యక్రమంలో రాష్ట్రాలు కలిసి పనిచేయాలని అన్నారు. శ్రీ అన్న అనేది పర్యావరణ అనుకూల పంట, రైతుకు అనుకూలమైన ఒక సూపర్ ఫుడ్ అని అన్నారు. చమురు ఉత్పత్తిలో ఆత్మనిర్భర్‌గా మారాలని అన్నారు. రాష్ట్రాలు 50 వేల పైబడి అమృత్ సరోవర్లను నిర్మించడాన్ని ప్రధాని ప్రశంసించారు. జల సంరక్షణ కోసం విలువైన ఆస్తులను సృష్టించి, స్థానిక ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నందున ఈ మిషన్‌ను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాలు ఆర్థికంగా పటిష్టంగా మారేందుకు, ప్రజల కలలను నెరవేర్చే కార్యక్రమాలను చేపట్టేందుకు వీలుగా ఆర్థికంగా వివేకవంతమైన నిర్ణయాలు తీసుకోవాలని మోడీ కోరారు.

11 రాష్ట్రాల సిఎంలు గైర్హాజరు

నీతి ఆయోగ్ సమావేశానికి 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారు. ముఖ్యమంత్రులు కె చంద్రశేఖర్ రావు (తెలంగాణ), నితీష్ కుమార్ (బీహార్), అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), సిద్ధరామయ్య (కర్ణాటక), పినరయి విజయన్ (కేరళ), నవీన్ పట్నాయక్ (ఒరిస్సా), భగవంత్ మాన్ (పంజాబ్), అశోక్ గెహ్లాట్ (రాజస్థాన్), ఎంకె స్టాలిన్ (తమిళనాడు), మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్) గైర్హాజరయ్యారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

తేది:26.05.2023, ఇ-టెండర్ నోటీసు నం.సి/ఇ.221/ఇఎల్ఎస్/ఎల్‌జిడి/ఆర్‌సి/306ఎ/23-24/04,
PUB/0556

భారత రాష్ట్రపతి మరియు దిగువసంతకందారుడు తరపున క్రింది విధమైన పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం. : 1, టెండర్ నం. మరియు తేదీ: సి/ఇ.221/ఇఎల్ఎస్/ఎల్‌జిడి/ఆర్‌సి/360ఎ, తేదీ: 26.05.2023 పని వివరణ: స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా లల్లాగూడ వద్ద పారవేసే అధికార సౌకర్యం, విద్యుత్ లోకో షెడ్ యొక్క ప్రమాదకరమైన వ్యర్థాలను పారవేయడం. టెండర్ విలువ (రూ.): 35,43,622.22/-, ఇఎమ్‌డి (రూ.) : 70,900/-, టెండర్ ఫారం యొక్క ఖరీదు (రూ.) : లేదు. పూర్తి కాలం: 24 నెలలు, ముగింపు తేది మరియు సమయం మరియు ప్రారంభం : 22.06.2023, 15.00 గం. మరియు 22.06.2023, 15.15 గం.

ఆఫర్ యొక్క చెల్లుబాటు: టెండర్ యొక్క ప్రారంభ తేది నుండి 63 రోజులు.
వెబ్‌సైట్ "www.ireps.gov.in" ద్వారా టెండర్ డాక్యుమెంట్ సమర్పణ

సీనియర్.డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఇఎల్ఎస్, లల్లాగూడ, సికింద్రాబాద్.

తేది:25.05.2023, ఇ-టెండర్ నం.బి/ఎస్‌జి/సిఎన్/ఎస్అండ్‌టి/జిఎన్‌టి/4/2023-24,
PUB/0561

భారత రాష్ట్రపతి మరియు సిగ్నల్ అండ్ టెలికాం (కన్‌స్ట్రక్షన్), సౌత్ సెంట్రల్ రైల్వే, జిఎన్‌టి విజయవాడ తరపున టెండరింగ్ లో ఓపెన్ టెండర్/సింగిల్ ప్యాకెట్ సిస్టం క్రింద దిగువ పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం.: 1, టెండర్ నోటీసు నం.: బి/ఎస్‌జి/సిఎన్/ ఎస్అండ్‌టి/4/2023-24, తేది: 25.05.2023, పని పేరు : ఎస్.సి.ఆర్. యొక్క ఎస్‌సి డివిజన్ కెఐ-కెజెడ్‌జె సెక్షన్ల మధ్య ట్రాక్ యొక్క ట్రిప్లింగ్ తో కనెక్షన్‌లో 50 కి.మీ.లు. ఎర్రుపాలెం (వైపి)-పండిలపల్లి (పిఎన్‌డిపి) మధ్య ఇండోర్ టెలికాం పరికరాల సంస్థాపన పనులు మరియు 6 క్వాడ్ కేబుల్ రద్దు మరియు హెచ్‌డిపిఇ డక్ట్ మరియు కేబుల్స్, బ్లోయింగ్, బాక్ ఫిట్టింగ్, జాయింటింగ్, స్ప్లిసింగ్ యొక్క కందక నిర్మాణం వేయడం. టెండర్ విలువ (రూ.) : 6,81,21,233.60/-, పూర్తి కాలం: 09 నెలలు, ముగింపు తేది మరియు సమయం: 20.06.2023, 15.00 గం.

1) బిడ్ డాక్యుమెంట్లు మరియు ఇతర వివరాల కొరకు https://ireps.gov.in లాగిన్ అవ్వండి.
2) టెండర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు టెండర్ వ్యవధి కాలం ముగింపుకు పదిహేను రోజుల ముందు సమర్పించాలి.
3) ఏదైనా సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) టెండర్ సమర్పణ కాలం ప్రారంభం వరకు టెండరర్లు చూసుకోవాలి.

డివై. చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) జిఎన్‌టి విజయవాడ

తేది:25.05.2023, ఇ-టెండర్ నోటీసు నం.బి/ఇ.29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-05-23-24
PUB/0562

దిగువసంతకందారుడు ద్వారా ఐరెప్స్ లో క్రింది పనుల కొరకు టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం.: 1, టెండర్ నం.: ఇ/ఇ.29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-05-23-24, పని వివరణ : విజయవాడ-విశాఖపట్నం విభాగంలో ఎమ్‌సిఎస్/ఆర్‌జెవై వద్ద ప్రతిపాదిత సర్ఫేస్ వీల్ లాత్ (పిట్ వీల్ లాత్) క్రింద కనెక్షన్‌తో ఓహెచ్‌ఇ మార్పులు మరియు చేర్పులు. సుమారు విలువ (రూ.) : 41,65,726/-, బిడ్ సెక్యూరిటీ (ఇఎమ్‌డి) (రూ.) : 83,300/-, పూర్తి కాలం: 12 నెలలు.

క్ర.సం.: 1- టెండర్ ఫారం విలువ (రూ.) : లేదు
ముగింపు తేది: 21.06.2023, 15.00 గం.లు.

సీనియర్.డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/టిఆర్‌డి/విజయవాడ.
A0790

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

రికవరీ ఆఫీసర్-II వారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
భారత ప్రభుత్వము, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకింగ్ విభాగం)
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవనం, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020, ఎ.పి.
ఫోన్: 0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com

R.P. No.402 of 2019 in OA No. 473 of 2017
కెనరా బ్యాంక్, చంద్రమౌళి నగర్ బ్రాంచ్, గుంటూరు
వర్సెస్
M/s. శ్రీనివాస కాటన్ ట్రేడర్స్

విషయం: ఇ-వేలం అమ్మకం వాయిదా ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా 12.04.2023 తేదీతో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ప్రకారం https://www.bankeauctions.com వెబ్‌సైట్‌లో 26.05.2023వ తేదీన జరుపవలసిన షెడ్యూలు ఆస్తుల ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం బిడ్లు రానందున, సిహెచ్‌ఆర్ బ్యాంక్ యొక్క అభ్యర్థన మేరకు తేది **23-06-2023** నకు వాయిదా వేయడమైనది. ధరావత్తు మరియు బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది 21-06-2023 మరియు బిడ్స్ హార్డ్‌కాపీలను సమర్పించుటకు ఆఖరు తేది 22-06-2023. తేది 12.04.2023 తో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ఇతర నియమనిబంధనలలో ఏ మార్పు లేదు.

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది. 25-05-2023 న జారీచేయడమైనది)

(బి.ఎన్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు)
రికవరీ ఆఫీసర్

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడేది)
కార్పొరేట్ ఆఫీస్: నెం. 769, స్పెన్సర్స్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్ -II, అన్న సాలై, టియన్-600002.
044-42995000, 044-42995050

స్వాధీనతా ప్రకటన (యు/ఎస్ రూలు 8 (1) క్రింద) స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటీ అండ్ రీఎన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 నందు చట్టం 54) ప్రకారం మెస్సెర్స్ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తమును, దానిపై వడ్డీతో కలిపి చెల్లించవలసినదిగా ఈ క్రింది పేర్కొనబడిన రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైంది. రుణగ్రహీతలు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 నందలి రూలు 8 ప్రకారము క్రింద వివరించిన ఆస్తులను స్వాధీనత తీసుకోవడమైనదని ఈ క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. ముఖ్యంగా రుణగ్రహీతలు సాధారణ ప్రజానీకమును ఇందుమూలంగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల బాకీ మొత్తమునకు, వడ్డీ, ఇతర ఖర్చులు మొదలైనవి మెస్సెర్స్ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) చట్టప్రకారం రుణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించుకోడానికి శ్రద్ధ వహించవలెను.

క్ర. సం.	రుణగ్రహీతలు/ హామీదారుల పేర్లు	సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరణ (స్థిరాస్తి)	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయి	స్వాధీనతా తేది
1	శాఖ: రాజమండ్రి L.No: SEVJAWD0297278 రుణగ్రహీతలు: శ్రీ.పులపాక కార్తిక్ సహ రుణగ్రహీత : శ్రీమతి. పులపాక జయరాణి శ్రీ.పులపాక రాంబాబు	కృష్ణా రిజిస్ట్రేషన్ జిల్లా, గన్నవరం ఎస్.ఆర్.ఓ., ఆగిరిపల్లి మండలం, అడవినిక్కలం గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.425/3లో రెసిడెన్షియల్ ఇంటి బేరింగ్ డో.నం.8-74, కొలిచే: 145.2 చ.గ.లు. లేదా 121.40 చ.మీ.లు., మూల్యాంకనం నం.211 క్రింది విధంగా ఉన్న సరిహద్దులు :ఉత్తరం: యలమర్తి మంగయ్య యొక్క ఆస్తి, దక్షిణం: పంచాయతీ రోడ్డు, తూర్పు: ఆర్ అండ్ బి రోడ్డు, పడమర: నల్లమోతు కోటమ్మ యొక్క ఆస్తి. కొలతలు: కృష్ణా రిజిస్ట్రేషన్ జిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉన్న 1452 చ.గ.లు. లేదా 121.40 చ.మీ.లు.	02-02-2023 & Rs. 600671/-	24-05-2023

తేది: 28.05.2023, ప్రదేశం : విజయవాడ
సం/- ఆధీకృత అధికారి ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

ఫ్యాషన్



- కోలా ప్రియాంక
తిరుపతి.

వింత పిల్లి



విజయనగర సామ్రాజ్యానికి రాజు శ్రీకృష్ణ దేవరాయలు. వారి సభ పేరు భువన విజయం. ఈ సభలో 8 మంది కవులు వుండేవారు. వీరిని అష్టదిగ్గజ కవులు అంటారు. ఒకరోజు రాజు కవులతో సభ ఏర్పాటు చేశారు. కవులను ఇలా అడిగాడు. 'మనం పెంచుకునే జంతువుల్లో అందమైన జంతువు ఏది? అని. అందుకు కవులందరూ ఏకాభిప్రాయంతో పిల్లి అని జవాబు ఇచ్చారు. అయితే ఒక వింత పిల్లి కావాలని రాజు కవులకు ఆజ్ఞాపించాడు.

మరుసటి రోజు కవులంతా తమ తమ పిల్లలను తీసుకొని వచ్చి వాటి వింత ఏమిటో చెప్పసాగారు. తెనాలి రామకృష్ణ కవి వంతు వచ్చింది. తన పిల్లిని తీసుకుని వచ్చాడు. తన పిల్లి పాలు తాగదని, అదే వింత అని చెప్పాడు. రాజు పరీక్షించ దలిచాడు. పాలతో నింపిన గిన్నెలు వరుసలో పెట్టించాడు. పిల్లులన్నీ వెళ్లి పాలగిన్నెలో మూతి పెట్టి తాగ సాగాయి. రామకృష్ణ పిల్లి మాత్రం పాల గిన్నెలు వద్దకు వెళ్లకుండా ఉండిపోయింది. బొమ్మలా నిలబడిపోయింది. ఆ వింతకు రాజు, సభలో ఉన్నవారు ఆశ్చర్యపోయారు. తెనాలి రామకృష్ణుడి పిల్లికి మెచ్చి బహుమతి ఇచ్చారు.

ఇదెలా సాధ్యం? అని రాజు రామకృష్ణుడిని అడిగాడు.. 'వారం రోజుల క్రితం పని మీద వెళ్లి మూడు రోజులు వేరే ఊరులో ఉన్నాను. దీనికి తినటానికి ఏమి పెట్టలేదు. ఊరు నుంచి వచ్చిన తరువాత వేడివేడి పాలు గిన్నెలో పోసి పెట్టాను. ఆకలితో ఉండడం వల్ల ఒక్క అంగలో వచ్చి పాల గిన్నెలో మూతి పెట్టింది. అంతే. మూతి కాలింది. అప్పట్నుంచి గిన్నెలో పాలు తాగడానికి భయపడుతోంది' అన్నాడు. అందరూ గొల్లుమని నవ్వారు.



- యడ్ల యానీ అక్షర,
7వ తరగతి
పల్నాడు చిల్డ్రన్ క్లబ్, జనవిజ్ఞాన వేదిక,
చిలకలూరిపేట



- జి. కుషాల్ అమృత్ సాయి,
శ్రీ చైతన్య స్కూలు,
అద్దంకి,
బొడ్డువానిపాలెం,
బాపట్ల జిల్లా.



- హేమదుర్గ,
సుందరయ్యనగర్,
తాడేపల్లి.



నవ్వుకుందాం

టీచర్ : ఏంట్రా రఘు! అలా కళ్లు ఆర్పకుండా చూస్తున్నావు?

రఘు : ఏంలేదు టీచర్! ఇందాక మీ పరసులో నుంచి మీ ఆధార్ కార్డు కింద పడింది. టేబుల్ మీద పెడదామని తీశా. ఆధార్ కార్డులో ఉన్న మీ ఫొటోకి, మీకు అసలు సంబంధమే లేదు టీచర్. అందుకే మీరేనా? కాదా? అని చూస్తున్నా.


క్లాస్ పిల్లలు : హా...హా...

బొమ్మలు





-జి. రాకేష్,
9వ తరగతి,
ఎస్.కె.పి. వి. వి. హెచ్. హెచ్. స్కూలు,
విజయవాడ.





- జి. రమ్య,
4వ తరగతి,
అన్నపూర్ణ
ప్రభుత్వ స్కూలు,
విజయవాడ.

JEEVANA

జీవన the family

మీ కోసం

చపాతీలు బాగా పొంగాలంటే పిండి కలిపేటప్పుడు పాలు, నీళ్లను సమపాళ్లలో కలపాలి.



జీవన సౌరభం

మార్చలేని గతాన్ని గురించి ఆలోచించకుండా, చేతిలో ఉన్న భవిష్యత్తుకై శ్రమించు.



బహిరంగంగా చర్చిద్దాం..

దైనందిన జీవితంలో భాగమైన ఎన్నో విషయాలను బహిరంగంగా చర్చిస్తుంటాం. ఆహారం, నిద్ర, ఆరోగ్యం వంటి అంశాలెన్నో ఆ చర్చల్లో పెద్ద గొంతుకతో వినపడతాయి. కాని సాధారణ జీవితంలో భాగమైన రుతుక్రమం గురించి మాత్రం చర్చించేందుకు ఎవరూ ముందుకురారు. గ్రామాల్లోనే కాదు, పట్టణాలు, నగరాల్లో కూడా ఇదే పరిస్థితి. కాని ఇది బిడియపడాల్సిన విషయం కాదు. రుతుక్రమాన్ని జీవక్రియగా పరిగణించాలి. దానిచుట్టూ అల్లుకున్న అపోహలను తొలగించే అవగాహన రావాలి.

2030 నాటికి రుతుక్రమాన్ని సాధారణ జీవితంలో భాగంగా చేయాలని, రుతుక్రమం చుట్టూ ఉన్న అపోహలు, మూఢనమ్మకాలు తొలగిపోవాలని రెండేళ్లుగా ఒకే థీమ్‌తో రుతుక్రమ పరిశుభ్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అయితే..

2022 మే 5న జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం మన దేశంలో 64.4 శాతం మంది 15 నుండి 24 ఏళ్ల వయస్సు వారు శానిటరీ ప్యాడ్లను ఉపయోగిస్తున్నారు. 49.6 శాతం మంది క్లాత్ నాప్కిన్లు వినియోగిస్తున్నారు. 15 శాతం మంది స్థానికంగా దొరికే ఉత్పత్తులు వాడుతున్నారు. కేవలం 0.3 శాతం మంది మాత్రమే కప్స్ ఉపయోగిస్తున్నారు. ఇక రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన ఉన్నవారి సంఖ్య కూడా చాలా తక్కువే. నివేదిక ప్రకారం 77.6 శాతం మంది మాత్రమే పరిశుభ్రతను పాటిస్తున్నారని తేలింది.

పరిశుభ్రత ఎందుకు పాటించాలి..

రుతుక్రమంలో పాటించే పరిశుభ్రత అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. అంతేకాదు, సమాన విద్య, సమాన అవకాశాలను మెరుగుపరుస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. కాని విచారించదగ్గ విషయమేమంటే ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మందికి రుతుక్రమ పరిశుభ్రత ఉత్పత్తులు లేదా సౌకర్యాలు అందడం లేదు. ఈ పరిస్థితి వారి విద్య, ఆరోగ్యం, మొత్తం జీవనంపై ప్రభావం చూపిస్తోంది.

విద్య పాత్ర..

రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన ఉండడం వల్ల వారి చుట్టూ ఉన్న కమ్యూనిటీని కూడా చైతన్యం చేయగలుగుతారు. తద్వారా ఆ అంశం చుట్టూ పేరుకుపోయిన అంధకారం తొలగిపోతుంది. కాబట్టి వ్యక్తులుగా చైతన్యం చేయడమే కాక వ్యవస్థను మార్చేందుకు కూడా పలు వర్క్‌షాపులు నిర్వహించాలి.

ఆ ధోరణి మారాలి..

ఇప్పటికీ రుతుక్రమ అంశాల్లో అనేక కళాంకాలు చాలా కమ్యూనిటీల్లో కనిపిస్తుంటాయి. రుతుక్రమంలో ఉన్నప్పుడు ఆమెని అపవిత్రురాలిగా చూస్తారు. ఎందుకు పనికిరానిదిగా పక్కనబెడతారు. ఆ సమయంలో వారు అపరిశుభ్రంగా ఉన్నామని భావిస్తారు. దూరంగా వెలివేయబడడం వారిని కుంగదీస్తుంది. ఈ వివక్ష వారిని ఆత్మన్యూనతకు గురిచేస్తుంది.

చర్చలు జరపాలి..

రుతుక్రమ పరిశుభ్రతపై వీలైనన్ని సార్లు చర్చలు జరపాలి. బహిరంగ ప్రదేశాల్లో పలు కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలి. పురుషులను, బాలురను కూడా ఈ చర్చల్లో భాగస్వామ్యం చేయడం వల్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుంది.

మే 28 రుతుక్రమ పరిశుభ్రతా దినోత్సవ సందర్భంగా మరోసారి ఆ విషయాలు బహిరంగంగా చర్చిద్దాం. మన చుట్టూ ఉన్నవారికి అవగాహన కల్పిద్దాం.

జ్ఞాపకశక్తి ఇలా మెరుగుపరుచుకోండి..



ఈ మధ్యకాలంలో వయస్సుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దల్లో జ్ఞాపకశక్తి తగ్గుతోంది. ఈ మతిమరుపు సమస్య యువతలో కూడా కనిపించడం ఆందోళన కలిగించే విషయం. అయితే కొన్ని రకాల ఆహారపదార్థాలను మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే ఈ మతిమరుపు సమస్య నుంచి బయటపడొచ్చు.

- ప్రతిరోజూ బాదం, వాల్‌నట్ లేదా జీడిపప్పు తీసుకుంటే జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉంటుంది
- క్యాబేజీ, ఉల్లిపాయలు, బ్రోకలీ వంటి కూరగాయలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. వాటిల్లో ఫ్లేవనాయిడ్లు ఉంటాయి. ఇవి జ్ఞాపకశక్తిని పెంచడంలో సహాయపడతాయి.
- పాలు, పెరుగు, కొవ్వు చేపలు, చిక్కుళ్ళు, బీన్స్, గుమ్మడి గింజలు, గోధుమలు, బార్లీ, వోట్స్ మొదలైన మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం వల్ల కూడా జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.
- మొలకలు, బచ్చలికూర, క్యారెట్లు, చిలగడదుంపలు మొదలైన కూరగాయలను తీసుకోవడంతో పాటు పచ్చి కూరగాయలను ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవాలి.
- గుడ్డు సొనలు, తృణధాన్యాలు, సోయాబీన్స్, నువ్వుల గింజలు లెసిథిన్ అనే పోషకాన్ని కలిగి ఉంటాయి. ఇది జ్ఞాపకశక్తిని, మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి.
- విటమిన్ బి12 పుష్కలంగా ఉండే గుడ్లు, చికెన్, చేపలు, పాలు వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి, అలాగే జ్ఞాపకశక్తి పెంచడంలో సహాయపడతాయి.
- నిమ్మ, నారింజ, ఉసిరి, క్యాప్సికం, ఆకు కూరలు వంటి విటమిన్ సి అధికంగా ఉండే సిట్రస్ పండ్లు, కూరగాయలను తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది.

'ఆదిపురుష్'తో పాటే సలార్



ప్రభాస్ – ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'సలార్'. హోంబలే ఫిల్మ్ సంస్థ నిర్మిస్తోంది. శ్రుతిహాసన్ కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 28న థియేటర్లలోకి రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్ని వేగవంతం చేయాలని త్వరలో చిత్ర గ్లింప్స్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. జూన్ 16న రానున్న ప్రభాస్ 'ఆదిపురుష్' చిత్రంతో పాటే 'సలార్' ప్రచార చిత్రాన్ని విడుదల చేయనున్నారని సమాచారం. ఇక ఈ సినిమాలో మరో కీలకమైన ప్రతినాయక పాత్రను సౌరవ్ లోకేష్ పోషిస్తున్నట్లు తెలిసింది. నటి శ్రియా రెడ్డి ఈ సినిమాలో ఓ శక్తిమంతమైన పాత్రలో సందడి చేయనుంది. రవి బస్రూర్ సంగీతం అందించారు.



జూన్ 9న 'యూనివర్శిటీ'


'10వ తరగతిలో పేపరు లీకేజీలు, గ్రూపు 1–2 లాంటి ఉద్యోగ పరీక్షల్లోనూ పేపరు లీకేజీలు, ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి ? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? లంబకోణాలు నేర్పిన వాళ్ళే కుంభకోణాలు జేస్తూ ఉంటుంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు విలవిల కొట్టుకుంటూ ఊపిరాడక గింజు కుంటుంటే ఈ విద్యావ్యవస్థ, ఈ ఉద్యోగ వ్యవస్థ నిర్వీర్యం కావాలా? కాకూడదు. మనది నిరుద్యోగ భారతం కాదు, ఉద్యోగ భారతం కావాలి అని చాటి చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ" అంటున్నారు ఆర్ నారాయణ మూర్తి. స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌లో ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'యూనివర్సిటీ'. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని జూన్ 9న రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదలకు సిద్ధంగా ఉంది.

ఇకపై నా సినిమాలన్నీ తెలుగులోనూ ...



టొవినో థామస్ ప్రధాన పాత్రధారిగా, అపర్ణా బాలమురళి, కుంచక్కో బోబన్ కీలకపాత్రల్లో నటించిన మలయాళ చిత్రం '2018'. జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో ఈ నెల 26న ప్రముఖ నిర్మాత బన్నీ వాసు రిలీజ్ చేయగా.. మంచి స్పందన లభించింది. తొలి రోజు రూ. కోటికి పైగా వసూళ్లను రాబట్టి దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో టోవినో థామస్ మాట్లాడుతూ.. 'చాలా ఆనందంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించారు. ఇకపై నా సినిమాలన్నీ తెలుగులోనూ డబ్ చేస్తా. చాలా మందికి సినిమా ఎంటర్టైన్మెంట్. కానీ నా వరకు సినిమా జీవితం.' అన్నారు.

ఓటీటీల్లో ఉచితంగా కొత్త సినిమాలు



ప్రస్తుతం ఓటీటీలో సినిమాలు చూడటం ఎక్కువైంది. దానికి తగ్గట్లు కొత్త సినిమాలు కూడా రెండు, మూడు వారాల్లో ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. ఓటీటీ సంస్థలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా కొత్త కొత్త సినిమాలను రిలీజ్ చేస్తూ.. ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుంది. తాజాగా పలు ఓటీటీ సంస్థలు సమ్మర్ వినోదాల పేరుతో ఉచితంగా సినిమాలు చూసే వెసలుబాటును కల్పిస్తున్నాయి. అహాలో రెండురోజుల్లో 'అన్‌స్టాపబుల్' ఎపిసోడ్‌లను ఉచితంగా స్ట్రీమింగ్ చేయనుంది. ఐపీఎల్‌ను ఫ్రీగా అందిస్తున్న జియో సినిమా కొన్ని సినిమాలను ఫ్రీగా అందిస్తుంది. 'భేదియా' విక్రమ్ వేద, కచ్చేయ్ లింబూ, థగ్స్, భూ సినిమాలు జియో సినిమా ఆప్‌లో ఉచితంగా చూడొచ్చు. జీ–5లో మాత్రం 'బింబిసార' చిత్రం 15 నిమిషాలు మాత్రమే ఫ్రీగా చూసే వెసులుబాటు కల్పించింది.

ఐఫాలో 'గంగూబాయి'కి మూడు అవార్డులు



ఏడాది క్రితం వచ్చిన గంగూబాయి కతియావాడి ఇండియన్ బాక్సాఫీస్‌పై పెను సంచలనమే చేసింది. లేడీ ఓరియెంటెడ్ సినిమాకు ఆ రేంజ్ హడావిడి మునుపెన్నడూ జరగలేదు. సంజయ్‌లీలా భన్సాలీ విజన్‌కు, ఆలియాభట్ నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. వంద కోట్ల బొమ్మతో హిందీ బెల్ట్‌పై ఆలియాభట్ విజయ కేతనం ఎగురవేసింది. నెల రోజుల కిందట జరిగిన 68వ ఫిలింఫేర్ అవార్డుల కార్యక్రమంలో ఏకంగా పది అవార్డులను సొంతం చేసుకుని చరిత్ర సృష్టించింది. తాజాగా ఈ సినిమా ఐఫా అవార్డుల్లో మరోసారి సత్తా చాటింది. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్–2023 వేడుక యూఏఈ రాజధాని అబుదాబిలో ఘనంగా ప్రారంభమైంది. కాగా ఈ అవార్డు ఫంక్షన్‌లో గంగూబాయి సినిమాకు మూడు అవార్డులు వరించాయి. బెస్ట్ స్క్రీన్‌ప్లే విభాగంలో సంజయ్ లీలా భన్సాలీ, ఉత్కర్శిని వషిష్ఠ అవార్డును గెలుచుకున్నారు. ఇక బెస్ట్ సినిమాటోగ్రాఫర్‌గా సుదీప్ ఛటర్జీ అవార్డు అందుకున్నాడు. ప్రకాష్ కపాడియా–ఉత్కర్శిని వశిష్ఠ బెస్ట్ డైలాగ్ విభాగంలో అవార్డు అందుకున్నారు. ఇలా మూడు విభాగాల్లో గంగూబాయి అవార్డులు కైవసం చేసుకుంది.

ఫైనల్లో ప్రణయ్

- సెమీస్‌లో ఓడిన పి.వి సింధు
- మలేషియా మాస్టర్స్ టోర్నీ



కౌలాలంపూర్ (మలేషియా) : మలేషియా మాస్టర్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. టైటిల్ ఫేవరేట్, అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో పరాజయం పాలవగా.. మెన్స్ సింగిల్స్‌లో సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్‌ఫైనల్స్ వరకు ఎదురులేని విజయాలతో పతక ఆశలు రేపిన మహిళల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.2 సెమీస్ సమరంలో అనూహ్య పరాజయం చవిచూసింది. ఏడో సీడ్ గ్రెగోరియ టన్‌జంగ్ (ఇండోనేషియా) చేతిలో వరుస గేముల్లో ఓటమి చెందింది. హెచ్.ఎస్ ప్రణయ్ సెమీఫైనల్లో ప్రత్యర్థి వాకోవర్‌తో నేరుగా టైటిల్ పోరుకు చేరుకున్నాడు. నేడు అంతిమ సమరంలో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యంగ్‌తో పోటీపడనున్నాడు.

చెమట పట్టకుండా! : పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో హెచ్.ఎస్ ప్రణయ్ తుది పోరుకు చేరుకున్నాడు. క్వార్టర్‌ఫైనల్లో కిదాంబి శ్రీకాంత్‌పై మెరుపు విజయం సాధించిన క్వాలిఫయర్ క్రిస్టియన్ (ఇండోనేషియా) శనివారం సెమీఫైనల్లో ప్రణయ్‌తో తలపడ్డాడు. క్రిస్టియన్‌పై ఆరంభం నుంచీ ఆధిపత్యం చూపించాడు ప్రణయ్. 11–2తో విరామ సమయానికి తొలి గేమ్‌లో తిరుగులేని ఆధిక్యం సంపాదించాడు. ద్వితీయార్థంలో క్రిస్టియన్ పుంజుకుని 15–15 వద్ద స్కోరు సమం చేసి ఉత్కంఠకు తెరతీశాడు. 19–17తో ప్రణయ్ తొలి గేమ్ సొంతం చేసుకునే క్రమంలో.. క్రిస్టియన్ మోకాలి గాయానికి గురయ్యాడు. నొప్పితోనే కోర్టును వీడిన క్రిస్టియన్ మళ్లీ రాకెట్ పట్టలేదు. తీవ్రమైన నొప్పితో క్రిస్టియన్ సెమీఫైనల్స్ నుంచి వాకోవర్ ఇచ్చాడు. అప్పటికే తొలి గేమ్‌లో ఆధిపత్యం చెలాయించిన హెచ్.ఎస్ ప్రణయ్ మరో గేమ్‌లో ఆడాల్సిన అవసరం లేకుండానే ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మరో సెమీఫైనల్లో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యంగ్ 21–13, 21–19తో చైనీస్ తైపీ షట్లర్ లిన్ చున్ యిపై అలవోక విజయం నమోదు చేశాడు.

మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు నిరాశపరిచింది. సుదీర్ఘ విరామం అనంతరం ప్రత్యర్థులపై ఎదురుదాడితో హడలెత్తించిన సింధు.. సెమీఫైనల్లో నిలకడ లేమి ఆటతీరుతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. 44 నిమిషాల సెమీఫైనల్ పోరులో ఇండోనేషియా అమ్మాయి గ్రెగోరియ టన్‌జంగ్ సాధికారిక విజయం సాధించింది. 14–21, 17–21తో పి.వి సింధు వరుస గేముల్లో ఇండోనేషియా షట్లర్‌కు తలొగ్గింది. తొలి గేమ్‌లో సింధు 3–0తో శుభారంభం చేసింది. కానీ ఇండోనేషియా షట్లర్ వేగంగా పుంజుకుంది. 7–7తో స్కోరు సమం చేసింది. 11–8తో ముందంజ వేసిన సింధు.. విరామం అనంతరం ఆధిక్యం నిలుపుకోలేదు. 12–12 వద్ద స్కోరు సమం చేసిన గ్రెగోరియ..16–13తో దూసుకెళ్లింది. అదే ఊపులో 21–14తో తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. ఇక చావోరేవో తేల్చుకోవాల్సిన రెండో గేమ్‌లో సింధు అంచనాలను అందుకోలేదు. విరామ సమయానికి 9–11తో వెనుకంజ వేసిన సింధు.. ఆ తర్వాత ఏ దశలోనూ ఇండోనేషియా షట్లర్‌ను అందుకోలేదు. ఆధిక్యం నిలుపుకుంటూ ముందుకెళ్లిన గ్రెగోరియ 21–17తో రెండో గేమ్‌ను, ఫైనల్స్ బెర్త్‌ను ఖాతాలో వేసుకుంది. నేడు జరిగే తుది పోరులో జపాన్ స్టార్, టాప్ సీడ్ అకానె యమగూచితో టైటిల్ కోసం గ్రెగోరియ తలపడనుంది.


నేడే ఐపిఎల్ ఫైనల్

తుదిపోరులో చెన్నైతో గుజరాత్ ఢీ

అహ్మదాబాద్ : ఐపిఎల్ –16 విజేత ఎవరో కొన్ని గంటల్లో తేలిపోనుంది. ఆదివారం జరిగే ఫైనల్‌లో చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ తలపడనున్నాయి. ఈ టైటిల్ పోరుకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మ్యాచ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపిఎల్ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించనున్నాడు. ఆదివారం మ్యాచ్‌తో ఐపీఎల్‌లో 250 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తొలి ఆటగాడిగా ధోనీ రికార్డుల్లోకెక్కనున్నాడు. కెప్టెన్ కూల్ ఇప్పటివరకు 249 మ్యాచ్‌లు ఆడాడు. ధోనీ తర్వాత అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో రోహిత్ శర్మ (243), దినేశ్ కార్తిక్ (242), విరాట్ కోహ్లి (237), రవీంద్ర జడేజా (225), శిఖర్ ధావన్ (217), సురేశ్ రైనా (205), రాబిన్ ఊతప్ప (205), అంబటి రాయుడు (203) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

రోహిత్ రికార్డు సమం చేస్తాడా?

నేటి మ్యాచ్‌లో గెలిచి ధోనీ ఈ సారి టైటిల్ అందిస్తే అత్యధికసార్లు (5) జట్టును విజేతగా నిలిపిన కెప్టెన్‌గా రోహిత్ శర్మ రికార్డును సమం చేస్తాడు. ముంబయి ఇండియన్స్‌ను రోహిత్ ఐదుసార్లు విజేతగా నిలిపిన సంగతి తెలిసిందే. ఒకవేళ చెన్నై ఓడిపోయి గుజరాత్ ఛాంపియన్‌గా నిలిస్తే వరుసగా రెండు సీజన్లలో తన జట్టుకు టైటిల్ అందించిన మూడో కెప్టెన్‌గా హార్దిక్ పాండ్య రికార్డు సష్టిస్తాడు. 2010,2011లో ధోనీ, 2019, 2020లో రోహిత్ శర్మ కెప్టెన్లుగా టైటిల్స్ అందించారు.



ఈ ఐపీఎల్ సీజన్ ఆరంభ మ్యాచ్ గుజరాత్, చెన్నైల మధ్యే జరిగింది. ఇప్పుడు ఫైనల్ మ్యాచూ వీరి మధ్య జరగనుండటం విశేషం. మరి ధోనీ సేన ఐదో విజయం సాధిస్తుందా..? హార్దిక్ సేన టైటిల్‌ను తనవద్దే ఉంచుకుంటుందా..? కొన్ని గంటల్లో తేలిపోనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68